మనసులో మాట

KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

అమరావతి

ఎన్టీఆర్ | పల్నాడు | కృష్ణ
గుంటూరు | బాపట్ల | ప్రకాశం

శనివారం 28 నవంబర్ 2026 పేజీలు 16



రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

16

- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాలు

రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన



9

మత్స్యకారుల ప్రాణరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- మంత్రి అచ్చెన్ నాయుడు
- తుఫాను హెచ్చరికలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- మిగిలిన బోట్లకు త్వరితగతిన ట్రాన్స్‌పాండర్లు అమర్చాలి
- అర్హులైన ప్రతి మత్స్యకారుడికీ బీమా రక్షణ కల్పించాలి
- అధికారుల అలసత్వంతో ప్రాణనష్టం జరిగితే కఠిన చర్యలు తప్పవు
- రాష్ట్రవ్యాప్తంగా బోట్ల ఫిట్‌నెస్, భద్రతా పరికరాలపై సమగ్ర తనిఖీలకు ఆదేశించిన రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబర్ 27: (మనసులో మాట)

మత్స్యకారుల ప్రాణరక్షణ, వారి కుటుంబాల భద్రత, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడూ ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మత్స్యకారుల భద్రత, ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, బోట్ల ఫిట్‌నెస్, బీమా సౌకర్యం తదితర అంశాలపై మంత్రి శుక్రవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫానులు, విపత్కర పరిస్థితుల్లో మత్స్యశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, ఆర్టీజీఎస్ జారీ చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకుండా కొందరు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్తుండటం ఆందోళనకరమన్నారు. సముద్రంపై ఎంత అనుభవం ఉన్నప్పటికీ ప్రకృతి విపత్తులను తేలిగ్గా

..మిగతా 5లో





కౌంటింగ్‌లో జాప్యం నివారించాలి.. ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి.. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

12



15

కూటమి ప్రభుత్వంలో ఎన్నికలు రాజకీయ పార్టీలతో కాకుండా పోలీసు వ్యవస్థతో చేయాల్సి వచ్చింది!

నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయండి.. పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు!

- 9 మండలాలు, 52 పంచాయతీలు, 414 వార్డుల్లో రెండవ విడత ఎన్నికలకు సర్వం సిద్ధం
- నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరిక



7



గణపవరం సర్పంచ్ పీఠం: కూటమి ధర్మంతో సమసిపోయిన వివాదం!

- చెరో రెండున్నరేళ్లు పదవి పంచుకునేందుకు టీడీపీ, జనసేన అంగీకారం
- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మండలనేని చరణ్ తేజ మధ్య ఫలించిన చర్చలు

9

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

మీడియా యాజమాన్య పారదర్శకత, మహిళల గౌరవ పరిరక్షణపై సమష్టి కార్యాచరణ అవసరం

- **రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు**

విజయవాడ, నవంబర్ 27 (మనసులో మాట)

రాజకీయ పార్టీలు, రాజకీయ శక్తులు సొంతంగా మీడియా సంస్థలను నిర్వహిస్తూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడం, ముఖ్యంగా మహిళల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా డిబేట్లు, రాతలు కొనసాగించడం ప్రజాస్వామ్యానికి పెను సవాలుగా మారిందని, ఈ ధోరణులను అరికట్టడానికి ప్రెస్ కౌన్సిల్ పునర్వ్యవస్థీకరణ, పారదర్శకత మరియు ప్రజా చైతన్యంతో కూడిన సమష్టి కార్యాచరణ అవసరమని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా యాజమాన్యాలు, ప్రయోజనాల వైరుధ్యం మరియు పర్యవసానాలపై"* నిర్వహించిన ఈ సమావేశానికి అకాడమీ ఛైర్మన్ శ్రీ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్య అతిథిగా పాల్గొనగా, వివిధ కమిషన్ల చైర్‌పర్సన్‌లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సీనియర్ న్యాయవాది, సీనియర్ జర్నలిస్ట్‌లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ముఖ్య అతిథిగా ప్రసంగించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహనిర్మాణ శాఖ మంత్రి *శ్రీ కొలుసు పార్థసారధి* మాట్లాడుతూ, నాలుగో స్తంభమైన మీడియా సామాజిక బాధ్యతతో వ్యవహరించి సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను పునర్వ్యవస్థీకరించి కఠిన నియమ నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కాదని, పార్టీలకు అతీతంగా మానవ సంబంధాలు, పరస్పర గౌరవం నిలబడాలని చెబుతూ, మహిళలను కించపరిచే అసభ్యకర భాషను వాడటం, ప్రచురించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. 40-50 ఏళ్ల క్రితం రూపొందించిన పాత నిబంధనలతో నేటి పోకడలను నియంత్రించడం కష్టమని, రామ్‌నాథ్ గోయెంకా వంటి విలువలున్న వ్యక్తుల స్ఫూర్తితో మీడియా రంగాన్ని ప్రక్షాళన చేయాలని, జర్నలిజం కేవలం లాభాపేక్షతో కూడిన వ్యాపారంగా మారితే సామాన్య ప్రజలకే నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

అధ్యక్ష ప్రసంగం చేసిన ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ *శ్రీ ఆలపాటి సురేష్ కుమార్* మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు మరియు రాజకీయ కుటుంబాలు సొంతంగా పత్రికలు, న్యూస్ ఛానల్స్ నడపడం ప్రజా ప్రయోజనాలకు, ప్రజాస్వామ్య మనుగడకు అత్యంత హానికరమని స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా 'వాషింగ్టన్ పోస్ట్' వంటి పత్రికలను కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేసినప్పుడు వ్యాపార ప్రయోజనాలకు సంబంధించిన కథనాల వద్ద స్పష్టమైన 'డిస్క్లోజర్' ఇస్తారని, కానీ దేశంలోని కార్పొరేట్ మీడియాలో అలాంటి పారదర్శకత లోపించిందని అన్నారు. రాజకీయ స్వార్థం కోసం సొంత మీడియా నడుపుతూ ఒకే అబద్ధాన్ని పదేపదే ప్రజల మెదళ్లలోకి ఎక్కించడం వల్ల ఓటర్లు సరైన నిర్ణయాలు తీసుకోలేరని హెచ్చరించారు. చట్టాల కంటే సమాజంలో విస్తృత చర్చ జరిగి, బలమైన పౌర సమాజం, ఉత్ప్రేరక శక్తుల ద్వారా ప్రజలే స్వచ్ఛందంగా పక్షపాత మీడియాను తిరస్కరించేలా చైతన్యం రావాలని, ఉత్తమ జర్నలిజం విలువల ప్రోత్సాహంతో పాటు ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే పాత్రను అకాడమీ పోషిస్తోందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ *శ్రీ పోతుల బాలకోటయ్య* మాట్లాడుతూ, రాష్ట్రంలో మీడియా వ్యవస్థ నిలువునా చీలిపోయిందని, రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ పార్టీల అధినేతల సొంత మీడియా సంస్థలు ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక ఉద్ధరణ, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన పత్రికలు వ్యక్తిత్వ హననానికి, విషప్రచారానికి వేదికలుగా మారాయని, అమరావతి ఉద్యమకారులు, దళిత నాయకులను విస్మరించడమే కాకుండా మహిళలు, రాజకీయ ప్రత్యర్థుల కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకర రాతలతో మానసిక క్షోభకు గురి చేస్తున్న ధోరణిని ఖండించారు. మార్పు అసాధ్యమని చేతులు ఎత్తేయకుండా, రాజ్యాంగబద్ధ అధికారాలతో అరాచక, పక్షపాత మీడియా పోకడలకు కళ్లెం వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, ప్రెస్ అకాడమీపై ఉందని, దివంగత పాత్రికేయులు రాఘవాచారి పేరుతో ఉన్న అకాడమీ ద్వారా కొత్త ఆలోచనలతో కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ *శ్రీమతి రాయపాటి శైలజ* మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మీడియా సంస్థలను నడుపుతూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయని, మహిళల వ్యక్తిగత జీవితాలు, గౌరవంపై అభ్యంతరకర రాతలు, డిబేట్లు పెరగడం ప్రజాస్వామ్యానికి పెను సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాక్ స్వాతంత్ర్య పరిమితులు, హుందాతనాన్ని విస్మరించి సెన్సేషన్ కోసం దుష్ప్రచారాలకు పాల్పడుతున్న తీరును విమర్శిస్తూ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అనేక ఫిర్యాదులు చేసినా ఆశించిన స్థాయిలో స్పందన, చర్యలు కనిపించడం లేదని పేర్కొన్నారు. మీడియా యాజమాన్యాలపై స్పష్టమైన డిస్క్లోజర్, పారదర్శకత ఉండాలని, యూరోపియన్ యూనియన్ వంటి దేశాల్లోని మీడియా ప్లూరాలిటీ, నియంత్రణ విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయి నుంచే విద్యార్థులు, యువతలో మీడియా విలువలపై బహిరంగ చర్చలు నిర్వహించాలని, బాధిత మహిళల వేదనను దృష్టిలో ఉంచుకుని కేవలం చర్చలతో ఆగిపోకుండా స్పష్టమైన తదుపరి కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి *డొక్కా మాణిక్య వరప్రసాద్* మాట్లాడుతూ, వాస్తవాలను చేరవేయాల్సిన మీడియా రంగం రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగమవుతుండటం ప్రజాస్వామ్యానికి పట్టిన



క్యాన్సర్ లాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత జర్నలిస్టుగా తన ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేస్తూ, కార్పొరేట్ పెట్టుబడులు, ఆ తర్వాత రాజకీయ శక్తుల సొంత మీడియా వల్ల సమాచారం కలుషితమవుతోందని, 'సాక్షి' వంటి మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు, 'మ్యానుఫ్యాక్చరింగ్ కన్సెంట్' ద్వారా ప్రజల ఆలోచనలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను, మహిళలను వ్యక్తిగతంగా కించపరిచేలా సోషల్ మీడియా, టీవీ డిబేట్లలో సాగుతున్న దౌర్జన్యాన్ని అరికట్టాలని కోరుతూ, ప్రజలకు రెండు వైపుల అభిప్రాయాలతో పాటు 'ఫ్యాక్ట్ చెక్' సమాచారం అందాలని, జిల్లా స్థాయిలో మేధావులు, నిపుణులతో చర్చా వేదికలు ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాపై అవగాహన కల్పించేలా అకాడమీ కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

హైకోర్టు సీనియర్ న్యాయవాది *పోసాని వెంకటేశ్వర్లు* మాట్లాడుతూ, రాజ్యాంగంలోని నాలుగు వ్యవస్థల పరమావధి ప్రజా ప్రయోజనమేనని, కానీ నేడు సిద్ధాంతం, ప్రజా దృక్పథం లేకుండా కేవలం అధికారమే లక్ష్యంగా పనిచేసే రాజకీయ శక్తులు మీడియా సంస్థలను నడుపుతూ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నిర్దిష్ట భావజాలం, ప్రజా ప్రయోజనంతో కమ్యూనిస్ట్ పత్రికలు నడుస్తున్నప్పటికీ, 'సాక్షి' వంటి పత్రికను రాజకీయ కుటుంబం అధికార దాహంతో స్థాపించి ప్రత్యర్థులపై బురదజల్లడం, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించడం వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తోందని విమర్శించారు. మీడియా స్వేచ్ఛపై కఠిన ప్రభుత్వ ఆంక్షలు కోరడం దుర్వినియోగానికి దారితీయవచ్చని, అందుకే ఇటువంటి పక్షపాత మీడియాను ప్రజలే చైతన్యవంతులై బహిష్కరించేలా ప్రచారం చేయాలని, ప్రజా సమస్యలపై ప్రశ్నించే పౌర సంస్థలను ప్రోత్సహించి ఈ చర్చను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (PCC) ఉపాధ్యక్షుడు * కొలనుకొండ శివాజీ** మాట్లాడుతూ, రాజకీయ లబ్ధి కోసం కొన్ని మీడియా సంస్థలు వార్తల్లో వ్యాఖ్యానాలను కలిపి వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని, ముఖ్యంగా మహిళల గౌరవానికి భంగం కలిగించేలా డిబేట్లు, రాతలు కొనసాగిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. 'సాక్షి' వంటి పత్రిక నిష్పక్షపాతంగా వార్తలు ఇవ్వకుండా రాజకీయ ప్రయోజనాల కోసం బురదజల్లేలా వ్యవహరిస్తోందని, కోటా రుక్మిణి, షర్మిల తదితర మహిళల విషయంలో జరిగిన చర్చలు, రాతల తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి పత్రికలకు విలువ, చరిత్ర ఉన్నాయని, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న మీడియా విశ్వసనీయత కోల్పోతోందని అన్నారు. మహిళలపై ఇటువంటి కథనాలు, డిబేట్లు భవిష్యత్తులో జరగకుండా మీడియా సంస్థలు స్వయంగా మార్గదర్శకాలు రూపొందించుకోవాలని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరియు సంబంధిత సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరుతూ, సమావేశం నిర్వహించిన అకాడమీ ఛైర్మన్ సురేష్ కుమార్‌కు, తీసుకునే తీర్మానాలకు పూర్తి మద్దతు, సంఘీభావం తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి అక్కినేని వనజ మాట్లాడుతూ, నేటి రాజకీయ వ్యవస్థలో పెరిగిపోయిన నేరమయ, వ్యాపారమయ ధోరణుల వల్ల ప్రజాస్వామ్య విలువలు, నాలుగో స్తంభమైన మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. 1215 నాటి మాగ్నా కార్టా ఒప్పందం నుంచే పాలకులను ప్రశ్నించడం, వాస్తవ సమాచారాన్ని తొక్కిపెట్టకుండా ప్రజలకు అందించడం ప్రాథమిక హక్కుగా గుర్తించబడిందని గుర్తు చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, స్వరాజ్య వంటి పత్రికలు పోషించిన చారిత్రక పాత్రను నేటి మీడియా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు పత్రికలు నడపడాన్ని పూర్తిగా నిషేధించడం ఆచరణసాధ్యం కాదని, అయితే నైతిక నియమావళికి లోబడి పనిచేసేలా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణ ఉండాలని, అసత్య కథనాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని అభిప్రాయపడ్డారు. మహిళలపై ఆన్‌లైన్ ట్రోలింగ్, వ్యక్తిత్వ హననాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండిస్తూ కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వ్యవస్థల ప్రక్షాళన కోసం పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు ఏకమై సమగ్ర కార్యాచరణ పత్రాన్ని రూపొందించి తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్ట్ *శ్రీమతి వడ్లమూడి పద్మావతి* మాట్లాడుతూ, సమాజ సంస్కరణోద్యమాల కాలం నుంచి నేటి రాజకీయ స్వార్థ ప్రయోజనాల వరకు తెలుగు పత్రికారంగ ప్రయాణాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజాచైతన్యం, విస్తృత చర్చ ద్వారానే జర్నలిజం సవాళ్లకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వార్త అమ్మకం సరుకుగా మారి, వార్తకూ వ్యాఖ్యానానికి మధ్య సరిహద్దు చెరిగిపోవడం వల్ల పాఠకులు నిజానిజాలను గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం మీడియాను నడుపుతున్నాయని, జర్నలిస్టులపై యాజమాన్యాలు, రాజకీయ శక్తుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఉంటున్నాయని పేర్కొంటూ, జర్నలిస్టులను మొదటిగా తప్పుపట్టాలనే అభిప్రాయంతో తాను విభేదిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శల పేరుతో మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననం, దూషణల ధోరణిని ఇరుపక్షాలు విడనాడి సంయమనం పాటించాలని, ఈ అంశంపై అకాడమీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలని సూచించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా పరిగణించడాన్ని వ్యతిరేకిస్తూ పిల్

ఒంగోలు నవంబర్ 27, మనసులో మాట

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన 81 ఏళ్ల నార్నే వెంకట సుబ్బయ్య ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విజయవాడ: ఈనాడు గ్రూప్ వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్ చెరుకూరి రామోజీ రావు జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా ప్రకటించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) దాఖలైంది. ప్రతి ఏటా నవంబర్ 16న రామోజీ రావు జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా జరుపుకోవాలన్న ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన 81 ఏళ్ల నార్నే వెంకట సుబ్బయ్య ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. వార్షిక ఉత్సవాల నిర్వహణ కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) నెం. 243ను చట్టవిరుద్ధమని ప్రకటించి, దానిని కొట్టివేయాలని పిటిషనర్ అదేశం కోరారు. రామోజీ రావు మరణానంతరం జూన్ 27, 2024న జరిగిన అధికారిక సంస్మరణ సభకు ప్రభుత్వం రూ. 4.28 కోట్లు ఖర్చు చేయడాన్ని కూడా సుబ్బయ్య ప్రశ్నించారు. రామోజీ రావు సాంఘిక కార్యకర్త గానీ, స్వాతంత్ర్య సమరయోధుడు గానీ కాదని సుబ్బయ్య వాదించారు.



మార్కాపురం జిల్లాలో వృద్ధుడిపై ఎలుగుబంటి దాడి

మార్కాపురం, (మనసులో మాట)నవంబర్, 27,

ఎలుగుబంటి దాడి కలకలం రేపింది. పశువులను మేతకు తీసుకెళ్లిన ఓ వృద్ధుడిపై ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బేస్తవారిపేట అటవీ రేంజ్ పరిధిలోని చింతపల్లి సెక్షన్, సింగరసానిపల్లి బీట్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సింగరపల్లి గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య (60) తన గేదెలను మేత కోసం సమీప ప్రాంతానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా అక్కడికి వచ్చిన ఎలుగుబంటి ఆయనపై దాడి చేసింది. ముఖ్యంగా ముఖంపై తీవ్రంగా దాడి చేయడంతో ఆయన రెండు కళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తీవ్ర గాయాలతో బాధపడుతున్న ఆయనను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎలుగుబంటి సంచారంపై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించి, ప్రజలకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నూజెండ్ల మండలంలో టీడీపీ 22 పంచాయతీలు కైవసం!

వినుకొండ, నవంబర్ 27 (మనసులో మాట)

వినుకొండ నియోజకవర్గం లోని నూజెండ్ల మండలంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటింది. మండలంలోని మొత్తం 27 పంచాయతీల్లో 22 చోట్ల టీడీపీ బలపరిచిన అభ్యర్థులు* విజయం సాధించగా, 5 చోట్ల మాత్రమే వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. మండలంలో 250 వార్డు స్థానాలు ఉండగా, 8 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 19 పంచాయతీల్లో 176 వార్డులకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. గురువారం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం 6 గంటలకే ఓటు వేసేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మధ్యాహ్నం 12 గంటలకే అత్యధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 170 పోలింగ్ కేంద్రాల్లో 33,071 మంది ఓటర్లుఉండగా, ఓటింగ్ ముగిసే సరికి 28,319 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మీద మండలంలో 85.63 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా వి అప్పాపురంలో 97.05 శాతం పోలింగ్ జరగక, అత్యల్పంగా ములకలూరులో 71.17 శాతం పోలింగ్ నమోదైంది.

గురువారం జరిగిన 19 పంచాయతీల్లో టీడీపీ 15, వైసీపీ 4స్థానాల్లో విజయం సాధించారు.

గెలుపొందిన సర్పంచుల వివరాలు ఇలా...

జంగాలపల్లి సర్పంచిగా మాచిపోగు మరియమ్మ,. ఉప్పలపాడు సర్పంచిగా బత్తుల అనూష, పుచ్చునూతల సర్పంచిగా రావులపల్లి గాలెయ్య ముక్కెళ్లపాడు సర్పంచిగా కొమరగిరి లక్షయ్య, కంభంపాడు సర్పంచిగా మేదరమెట్ల వెంకట నాగలక్ష్మి పమిడిపాడు సర్పంచిగా బత్తుల బాబు, వీ అప్పాపురం సర్పంచ్ గా మారెళ్ల నారాయణరెడ్డి,. మారెళ్లవారిపాలెం సర్పంచ్ గా కంచుమాటి తిరుపాలు,. చింతలచెరువు సర్పంచిగా చేవలమడుగు మాబూ సుభానీ,. ముప్పరాజువారిపాలెం సర్పంచ్ గా నిడమానూరి శ్రీను,. పాతనాగిరెడ్డిపల్లి సర్పంచ్గా చింతలచెరువు శివ సిద్ధయ్య, లింగముక్కపల్లి సర్పంచిగా దేవండ్ల పోలమ్మ, మృత్యుంజయపురం సర్పంచ్ గా వడ్లమూడి ధనలక్ష్మి, పెద్దవరం సర్పంచిగా ధూపాటి రాజు,ఐనవోలు సర్పంచిగా రేవెళ్ల కోటేశ్వరమ్మ, ములకలూరు సర్పంచిగా మందా రాములు, పాత త్రిపురాపురం సర్పంచ్ అమ్మతపూడి మరియదాసు, నూజెండ్ల సర్పంచ్ గా లగడపాటి సూరిబాబులు ఎన్నికైనట్లుగా అధికారులు వెల్లడించారు

విద్యాదాత మంగాదేవి మృతి దిగ్భ్రాంతి కరం...

- **సిపిఐ నేత కె. నారాయణ**

గుంటూరు, నవంబర్ 27 (మనసులో మాట)

గుంటూరు నగరంలో ప్రముఖ విద్యా సంస్థ శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ నిర్వాహకురాలు, విద్యాదాత మంగాదేవి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె మృతి సమాచారం అందుకున్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుంటూరులోనిన్న గురువారం ఆమె మరణించడం అత్యంత బాధాకరమని, ఆమె అస్తమయం విద్యా లోకానికి తీరని లోటు అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కె. నారాయణ మాట్లాడుతూ.. తాను గుంటూరులో ఏఐఎస్ఎఫ్ (AISF)లో పనిచేస్తున్న రోజుల్లో వెంకటేస్వరా బాల కుటీర్‌కు వెళ్లేవారని, అక్కడి నుంచి మంగాదేవి గారి వద్దకు వెళ్లేవారని గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆమెతో తమకు సన్నిహిత సంబంధం ఉందని తెలిపారు. గుంటూరులో ఎంతో విస్తరించిన విద్యా సంస్థగా ఎదిగి, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందేలా ఆమె కృషి చేశారని కొనియాడారు. వారం రోజుల క్రితం గుంటూరు వెళ్లినప్పుడు మంగాదేవి గారి ఇంటికి వెళ్లి పలకరించానని నారాయణ తెలిపారు. తనను చూసి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని "నువ్వు ప్రజా నాయకుడివి" అని దీవించారని చెప్పారు. అంతేకాకుండా తనకు ఒక పుస్తకాన్ని ఇచ్చి, దానిపై స్వయంగా "నారాయణ



ప్రజా నాయకుడు" అని రాసి ఇచ్చారని, ఆ పుస్తకం ఇప్పటికీ తన వద్ద భద్రంగా ఉందని భావోద్వేగంతో పంచుకున్నారు. మహా తల్లిగా నిలిచిన మంగాదేవి గారి మరణం పట్ల సిపిఐ తరపున ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె అందించిన విద్యను, ఆమె వ్యక్తిత్వాన్ని అభిమానించే వేలాది మంది శ్రేయోభిలాషులకు, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. వార్డును అభివృద్ధి చేసి చూపిస్తా – బత్తుల లక్ష్మీదేవమ్మ

నందిగామ నవంబర్ 27 (మనసులో మాట)

కంచికచర్లగ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఇందిరా కాలనీలోని 14వ వార్డు సభ్యత్వానికి కూటమి ప్రభుత్వం బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిని బత్తుల లక్ష్మీదేవమ్మ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల శివాజీ సతీమణి అయిన ఆమె వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీలో ఒకరిగా, మీ కుటుంబ సభ్యురాలిగా ఉంటూ వార్డులోని సమస్యలపై పూర్తి అవగాహనతో పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరి సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు, పారిశుధ్యం మెరుగుదలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణతో తనకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.



మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

వినుకొండ మండలంలో కూటమి హవా...

వినుకొండ,నవంబర్ 27
(మనసులో మాట)

వినుకొండ రూరల్ మండలంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి సత్తా చాటింది. మండలంలోని మొత్తం 26 పంచాయతీల్లో టీడీపీ 19, జనసేన 2, వైసీపీ 4, ఇండిపెండెంట్ 1స్థానాల్లో విజయం సాధించారు.

ఇప్పటికే 10 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, ఈరోజు 16 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.

గురువారం నాడు పోలింగ్ మరియు లెక్కింపు కార్యక్రమం పూర్తయిన వెంటనే 16 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల పేర్లు అధికారులు వెల్లడించారు వాటి వివరాలు ఇలా ఉన్నాయి

1. నరగాయపాలెం ఎన్నా సైదమ్మ
2. జాలలపాలెం పిడతల సైదమ్మ
3. వెంకుపాలెం గుడిపాటి అనూష



4. ఉప్పరపాలెం చింతా పెరిరెడ్డి
5. చీకటిగలపాలెం కానాల వెంకటేశ్వర్ రెడ్డి
6. శివాపురం కమతం అలివేలమ్మ
7. పెదకంచెర్ల కంచర్ల అనంతలక్ష్మి
8. ఉమ్మడివరం విప్పర్ల ఈశ్వరమ్మ
9. నాగులవరం చీరపురెడ్డి అంజలి
10. గోకనకొండ కొండి సౌందర్య
11. బ్రాహ్మణపల్లి తొగిరిశెట్టి మీరావాలి
12. విఠంరాజుపల్లి పగడాల చిన్న కోటిరెడ్డి
13. అందుగులపాడు కర్లకుంట నారాయణమ్మ
14. కొప్పుకొండ కోలా లక్ష్మి
15. పిట్టంబండ మక్కెన కొండలు
16. తిమ్మాయపాలెం కోరిక వెంకట్రావు

ఇప్పటికే ఏకగ్రీవమైన అభ్యర్థుల పేర్లు:

1. నీలగంగవరం కందుల పెద్ద రత్తయ్య
2. భారతపురం రాజారపు వెంకట రావు
3. కొప్పుకొండ తండా భూక్య మంత్రు నాయక్
4. దొండపాడు మద్దుకూరి రాంబ్రహ్మం
5. గోసుగుంట్లవారిపాలెం వేముల ఆంజనేయులు
6. హస్సనాయునీపాలెం నడిపూడి విష్ణు వేణి
7. ఏనుగుపాలెం ఒంగోలు సృజన్ రావు
8. చాట్రగడ్డపాడు ఆళ్ల వెంకటలక్ష్మి
9. నడిగడ్డ బోడెపూడి ప్రసాద్
10. పెరుమాళ్ళపల్లి చిలక బత్తిని పద్మ

మండలం ఫైనల్ లెక్క:
టీడీపీ 19, జనసేన 2, వైసీపీ 4, ఇండిపెండెంట్ 1

రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

వినుకొండ ,నవంబర్ 27
(మనసులో మాట)

రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ (వినుకొండ,) మరియు వేదాంత హాస్పిటల్స్ (గుంటూరు)వారి సంయుక్త ఆధ్వర్యంల వినుకొండ పట్టణంలో ఈనెల 29న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష ,కార్యదర్శులు ఎంఎస్ బాజీ, కూచి రామాంజనేయులు ,మరియు కోశాధికారి గాండ్ల నాగేంద్రుడు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వినుకొండ పట్టణంలోని స్థానిక పల్నాడు రోడ్డు నందు గల బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్(గోగినేని అవెన్యూ) నందు ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ మెగా వైద్య శిబిరంలో బిపి ,షుగర్ ,ఈసీజీ ,2d ఎకో వంటి పరీక్షలతోపాటు డెంటల్ క్లినిక్, ఐ క్లినిక్, పలమనాలజీ ,లతోపాటు ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం సంబంధిత విభాగాల వైద్యుల సూచనల మేరకు మందులను ఉచితంగా పంపిణీ చేయనట్లు రోటరీ అధ్యక్షులు ఎమ్మెస్ బాజీ తెలిపారు . ఈ మెగా శిబిరంలో గుంటూరు పట్టణంలోని ప్రఖ్యాత వైద్యులైన డాక్టర్ చింతా రామకృష్ణ (కిడ్నీ వైద్య నిపుణులు), డాక్టర్ ధన్య సురెడ్డి (మెదడు, వెన్నెముక వైద్య నిపుణురాలు), డాక్టర్ బి. వి. నరసింహ రావు (ఎముకల వైద్య చికిత్స నిపుణులు) ,డాక్టర్ సిద్ధావలి ,(నెమ్ము, ఊపిరితిత్తుల వైద్య చికిత్స నిపుణులు), డాక్టర్ చింత వాసవి (దంత శస్త్ర చికిత్స వైద్య నిపుణులు), డాక్టర్ కౌ తారపు సాయి కార్తీక్(గుండె వైద్య నిపుణులు) ,డాక్టర్ అపర్ణ (జనరల్ మెడిసిన్ మరియు డయాబెటాలజిస్ట్) మరియు మెడెక్ కంటి వైద్య నిపుణులచే వైద్య సేవలు ఈ శిబిరం లో ఉచితంగా చేయునట్లు తెలిపారు. వినుకొండ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ శిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలు పొందడం ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు..



మైదవోలు గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్‌గా బాలతోటి మార్తమ్మ థామస్ ఏకగ్రీవ ఎన్నిక

యడ్లపాడు నవంబర్ 27
మనసులో మాట

మండల పరిధిలోని మైదవోలు గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ గా బాలతోటి మార్తమ్మ థామస్, ఉప సర్పంచ్ గా భాస సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులందరూ ఏకాభిప్రాయంతో వారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బాలతోటి మార్తమ్మ థామస్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గ్రామ ప్రజలకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి, మౌలిక వసతుల కల్పనకు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఆమె ఏకగ్రీవ ఎన్నిక పట్ల గ్రామస్తులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.





రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

గుంటూరు,(మనసులో మాట)
నవంబరు 27 :

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ద్వారా ఎన్నికల విధుల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు విధులను కేటాయించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య ఆధ్వర్యంలో పూర్తి చేశారు. రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ, వివరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్. కె.ఖాజావలి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ జిల్లా అధికారి మోహన రాగిని పాల్గొన్నారు.



బాల్య వివాహం చేస్తే జైలు శిక్ష తప్పదు . ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారుల హెచ్చరిక

వినుకొండ , నవంబర్27
(మనసులో మాట)

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, వాటి నీ ఎవరు ప్రోత్సహించినా వారు శిక్షార్హులేనని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ కే .శ్రీదేవి, మరియు షేక్ మస్తాన్ బి లు స్పష్టం చేశారు.," బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా వినుకొండ నియోజకవర్గంలోని బోల్లాపల్లి మండలం మేళా వాగు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బాల్య వివాహ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేసుకోవడం మరియు ప్రోత్సహించడం కూడా నేర మేనని అందుకు ప్రతిఫలంగా రెండు సంవత్సరాల జైలు శిక్ష ,ఒక లక్ష రూపాయలు జరిమానా విధించబడతాయని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన రాహిత్యంతో తల్లిదండ్రులు చేసేందుకు తొందర పడతారని అటువంటి తొందరపాటును నివారించేందుకు చట్టం రూపొందించబడిందన్నారు. అయినప్పటికీ ఎవరైనా తల్లిదండ్రులు గాని, గ్రామస్తులు గాని ప్రోత్సహిస్తే, వాటిని ఎదుర్కొనేందుకు విద్యార్థినీలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందివ్వాలని సూపర్వైజర్లు సూచించారు. బాల్య వివాహాల కారణంగా చదువు మధ్యలోనే ఆగిపోయి భవిష్యత్తు అంధకారమవుతుందని, అనారోగ్యం వంటి సమస్యలు కూడా సంభవిస్తాయని ఈ సందర్భంగా శ్రీదేవి వివరించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



ప్రముఖ విద్యావేత్త డా. ఎన్. మంగాదేవి మృతికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ సంతాపం

గుంటూరు, (మనసులో మాట) నవంబర్, 27,

గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ విద్యావేత్త డా. ఎన్. మంగాదేవి (దేవి మేడమ్) మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుంటూరులోని బాలకుటీర్‌కు వెళ్లిన డా. రాయపాటి శైలజ, డా. మంగాదేవి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. తాను కూడా ఇదే విద్యాసంస్థలో విద్యాభ్యాసం చేయడంతో దేవి మేడమ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆమె మృతి వ్యక్తిగతంగా ఎంతో బాధ కలిగించిందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి, ముఖ్యంగా అనాథ పిల్లలకు విద్యను అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు డా. మంగాదేవి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆమె మరణం విద్యారంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, డా. మంగాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శనీయం..కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ,(మనసులో మాట) నవంబర్, 27,

తత్వజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే రీతిలో కీర్తనలు, రచనల ద్వారా అందించిన ప్రముఖ తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. భక్త కనకదాస జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హాజరై కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనకదాస రచించిన రామధ్యాన చరిత్ర, మోహన తరంగిణి వంటి ప్రముఖ రచనలు విశేష ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన జీవితాన్ని, బోధనలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపడంలో భక్త కనకదాస రచనలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీ నరసింహం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.జగ్గయ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల ప్రాణరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

మొదటిపేజీ తరువాయి

తీసుకోవద్దని హితవు పలికారు. ఒక్కోసారి చిన్నపాటి నిర్లక్ష్యం కూడా విలువైన ప్రాణాలను బలి తీసుకుంటుందని, కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతుందని పేర్కొన్నారు. తుఫానుల సమయంలోనే కాకుండా సాధారణ వేటకు వెళ్లేటప్పుడు కూడా ప్రభుత్వం రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (SOP) కచ్చితంగా అనుసరించాలని సూచించారు. భద్రతా ప్రమాణాల పై మత్స్యకారులకు ముందుగా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఆ తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించడం మత్స్యకారుల ప్రాణాలను కాపాడటానికేనని స్పష్టం చేశారు.

ట్రాన్స్‌పాండర్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలోని సుమారు 80 శాతం మత్స్యకార బోట్లకు ఇప్పటికే ట్రాన్స్‌పాండర్లు అమర్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మిగిలిన బోట్లకు కూడా వీలైనంత త్వరగా వీటిని ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సముద్రంలో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ట్రాన్స్‌పాండర్లను ఎలా వినియోగించాలి, వాటి ద్వారా సహాయం ఎలా పొందాలనే అంశాలపై మత్స్యకారులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. పరికరాలను అమర్చడంతోనే బాధ్యత పూర్తయినట్లు భావించకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సాంకేతిక లోపాలున్న వాటికి తక్షణమే మరమ్మతులు చేయించాలని, సాధ్యంకాని పక్షంలో కొత్తవి అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, నిర్వహణ, వినియోగంపై అవగాహన కల్పించడంలో అధికారుల అలసత్వాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ప్రతి బోటు ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి

రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంతాల్లోని మత్స్యకార బోట్ల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై మరోసారి సమగ్ర తనిఖీలు నిర్వహించాలని మత్స్యశాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఎన్ని బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చారు, ఇంకా ఎన్నింటికి ఏర్పాటు చేయాల్సి ఉంది, అమర్చిన వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, మిగిలిన బోట్లలో ఏర్పాటు చేయకపోవడానికి కారణాలేమిటనే వివరాలతో పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతిక సమస్యలతో పాటు అధికారుల స్థాయిలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందే బోట్ల ఫిట్‌నెస్, అవసరమైన రక్షణ పరికరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పాండర్లు పాడైనా, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా మత్స్యకారులు వెంటనే సంబంధిత ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (FDO), ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ లేదా గ్రామస్థాయిలోని విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ (VFA)ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంబంధిత సిబ్బంది నుంచి సరైన స్పందన లేకపోతే నేరుగా తన దృష్టికి సందేశం ద్వారా తీసుకురావచ్చని, అటువంటి విషయాలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని మత్స్యకారులకు మంత్రి భరోసా



ఇచ్చారు.

బీమా పరిధిలోకి అర్హులైన ప్రతి మత్స్యకారుడిని తీసుకురావాలి

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో బీమా అత్యంత కీలకమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్క మత్స్యకారుడూ బీమా రక్షణకు దూరం కాకూడదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (NFDB) ద్వారా అమలవుతున్న బీమా పథకం పరిధిలోకి అర్హులందరినీ తీసుకురావాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. సముద్రంలో చేపల వేట సాగించేవారితో పాటు చేపలు, రొయ్యల చెరువుల్లో పనిచేసే కార్మికులు, ఫీడ్ రంగం సహా మత్స్య అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడిన వారికి కూడా ఆయా పథకాల అర్హత నిబంధనల మేరకు బీమా ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. ఇందుకోసం అర్హుల వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన మత్స్యకారులు బీమా ప్రయోజనాలను కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని మంత్రి హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం నష్టపోయిన మొత్తాన్ని సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేసే పరిస్థితి కూడా రావచ్చని స్పష్టం చేశారు. అధికారుల చిన్నపాటి అలసత్వం కూడా ఒక మత్స్యకార కుటుంబానికి జీవితాంతం తీరని నష్టాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

మత్స్యకారుల భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమీక్ష

అనుకోకుండా జరిగే కొన్ని ప్రమాదాలను నివారించడం సాధ్యం కాకపోవచ్చని, అయితే మానవ తప్పిదాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రాణనష్టాన్ని ఎంతమాత్రం సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించకపోవడం, అవసరమైన రక్షణ పరికరాలు అందించకపోవడం, సాంకేతిక లోపాలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యశాఖ అధికారులతో తక్షణమే ప్రత్యేక సమీక్ష నిర్వహించి, భద్రతా ప్రమాణాల అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కమిషనర్‌కు సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి అధికారి అప్రమత్తంగా వ్యవహరించేలా చూడాలని ఆదేశించారు. మత్స్యకారుల ప్రతి ప్రాణం ప్రభుత్వానికి అత్యంత విలువైనదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వారి భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ హెచ్చరికలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అధికారులు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మత్స్యకారుల ప్రాణరక్షణతో పాటు వారి కుటుంబాల సంక్షేమం, ఆర్థిక భద్రతకు కూటమి ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

రీ పోలింగ్ లో అధికారుల వైఫల్యం....

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)

పంచాయతీ ఎన్నికల్లో ఘర్షణలు, బ్యాలెట్ పేపర్లు చించివేత కారణంగా బొల్లాపల్లి మండలంలో గురువారం వాయిదా పడిన పోలింగ్ ను శుక్రవారం అధికారులు తిరిగి నిర్వహించారు. బొల్లాపల్లి మండలంలో పోలీస్ బందోబస్తు మధ్య రెండు చోట్ల రీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వెల్లటూరు లో ఇరు వర్గాల ఘర్షణలు, బ్యాలెట్ బాక్సుల ధ్వంసం చేయడంతో బ్యాలెట్ పేపర్లు చిందర వందర గా పడిపోవడం, బయటికి రావడం తో తీవ్రంగా పరిగణించిన ఎన్నికల సంఘం, అధికారుల నివేదిక ఆధారంగా వెల్లటూరు పంచాయతీలో ఒకటో వార్డుకు రీపోలింగ్ కు ఆదేశించడం తో శుక్రవారం పూర్తిస్థాయి పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు రీపోలింగ్ నిర్వహించారు. ఒకటో వార్డులో 352 ఓట్ల కు గాను 53 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 15 శాతం పోలింగ్ నమోదయింది. సర్పంచ్ కి సంబంధించిన బ్యాలెట్ పత్రాలు మాయమైన నేపథ్యంలో రీపోలింగ్ కు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో గరికపాడు లో లో కూడా ప్రత్యేక పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు రీపోలింగ్ నిర్వహించారు. మొత్తం 1731 ఓట్ల కు గాను 351 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో 20శాతం పోలింగ్ నమోదయింది. మొత్తం మీద మండలంలో రెండు చోట్ల ఎన్నికల రీపోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపించుకున్నారు.

అయితే ఇది పోలింగ్ సందర్భంగా కూడా ఘర్షణలు జరిగే అవకాశం ఉందని ఆందోళనకు గురైన స్థానికులు పోలింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక





నారాయణ స్కూల్‌లో జోనల్ స్పోర్ట్స్ మీట్

వినుకొండ,నవంబర్ 27 (మనసులో మాట)

వినుకొండలోని నారాయణ ఈ.ఎం. స్కూల్ ప్రాంగణంలో వినుకొండ మరియు నరసరావుపేట బ్రాంచ్‌ల విద్యార్థుల కోసం జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వినుకొండ టౌన్ ఎస్.ఐ. నరేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరచాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

అదేవిధంగా కార్యక్రమానికి విచ్చేసిన క్లస్టర్ ప్రిన్సిపల్ శ్రీమతి భాగ్య రాణి మాట్లాడుతూ, వినుకొండ మరియు నరసరావుపేట క్యాంపస్‌లలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువులో రాణించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచేలా విద్యార్థులను ప్రోత్సహించడం పాఠశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వినుకొండ బ్రాంచ్ ప్రిన్సిపల్ హర్షవర్ధన్ రెడ్డి మరియు నరసరావుపేట బ్రాంచ్ ప్రిన్సిపల్ భాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రీడలు ప్రతి ఒక్కరిలో పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, నిరంతర సాధనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో వినుకొండ మరియు నరసరావుపేట క్యాంపస్‌ల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, పోటీతత్వం మరియు క్రీడాస్ఫూర్తి వెల్లివిరిశాయి. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి విజయవంతంగా ముగిసింది. టగ్ ఆఫ్ వార్ క్రీడ విభాగంలో వినుకొండ బ్రాంచ్ బాలికలు అయినా మల్లిక, సుహానా, మౌనిక ,ప్రణతి ,నందిని, నజీఫా ,మహాలక్ష్మి ,భవాని, ప్రవళిక ,అపర్ణ, ప్రిన్సి, సుహానా విజేతగా మరియు నరసరావుపేట బాలుర విభాగం నుంచి అఖిల్, అశ్వత్ ,అభినవ్, సాయి మనోజ్ ,మోక్షజ్ఞ ,సాదిక్, హుస్సేన్ ,చరణ్, విష్ణు, రోహితేశ్వర్ ,అరవింద్ విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎన్ డి హెడ్స్ సింహాద్రి , స్వాతి మరియు మారియా , కోఆర్డినేటర్స్ భద్రా రెడ్డి , గౌస్య మరియు రిహాని , ఏవో, అకాడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు



ఏపీ పారిశ్రామిక అభివృద్ధికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్.. కీలక ప్రాజెక్టులకు ఆమోదం..

అమరావతి: (మనసులో మాట) నవంబర్, 27,

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపనకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రైట్ టు బిజినెస్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సులభతరం చేసే విధానానికి కూడా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీనివల్ల కొత్త పరిశ్రమల ఏర్పాటులో అనుమతుల ప్రక్రియ వేగవంతం కానుంది. అలాగే కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి కోసం రూ.1,500 కోట్ల రుణం తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఇండస్ట్రియల్ కారిడార్‌లో భూకేటాయింపులకు సంబంధించిన విధానానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ కెమికల్ పార్కు ఏర్పాటుకు, శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో కియా సంస్థ రెండో ప్లాంట్ (కియా ప్లాంట్ 2) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో అదానీ సంస్థ ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్‌కు కూడా ఆమోదం లభించింది.

రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడం, పారిశ్రామిక రంగాన్ని విస్తరించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.





ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు (మనసులో మాట) నవంబర్, 27,

నగరంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక నియంత్రణ కార్యక్రమం చేపట్టినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ శేషయ్య పర్యవేక్షణలో శుక్రవారం మలేరియా సిబ్బంది వార్డుల వారీగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వర్షాల కారణంగా ఏర్పడిన నీటి నిల్వలు, డ్రైనేజీలు, కాలువలు, కల్వర్టులు, ఖాళీ స్థలాలు, ఇతర దోమల ఆవాసాలను గుర్తించి నిర్మూలించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దోమల నివారణలో భాగంగా యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహిస్తూ దోమల లార్వా దశలోనే నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి నిల్వ ప్రాంతాలు, మురుగు కాలువలు, నిర్మాణ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాలను పరిశీలించి లార్వా నిర్మూలన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నగరంలోని చెరువులు, పెద్ద ఖాళీ స్థలాలు, కాలువల్లో డ్రోన్‌ల సహాయంతో యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డ్రోన్‌ల వినియోగంతో విస్తృత ప్రాంతాలను తక్కువ సమయంలో కవర్ చేయడంతో పాటు సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో కూడా దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. అదేవిధంగా దోమల సాంద్రత అధికంగా ఉన్న రోడ్లు, నివాస ప్రాంతాలు, మార్కెట్లు, కాలనీలతో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వర్టులు, డ్రైనేజీ మార్గాలు, చీకటి, తేమతో కూడిన ప్రాంతాల్లో దోమల ఆవాసాలు ఏర్పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా కల్వర్ట్ ఫాగింగ్ చేపడుతున్నామని వెల్లడించారు. ప్రజలు కూడా దోమల నివారణలో భాగస్వాములు కావాలని కమిషనర్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కంటైనర్లు, పూల కుండీల్లోని నీటిని వారానికి ఒకసారి తొలగించి శుభ్రం చేయాలని కోరారు. దోమతెరలను వినియోగించాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఏ.పీ.ఎస్.హెచ్.ఆర్.సి చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

గుంటూరు,(మనసులో మాట),- నవంబరు 27 :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏ.పీ.ఎస్. హెచ్.ఆర్.సి) చైర్మన్ జస్టిస్ ఎం .సత్యనారాయణమూర్తిని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శుక్రవారం గుంటూరు అటవీ శాఖ అతిధి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టును ఈ నెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఈ క్యాంపు కోర్టులో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించి హెచ్ఆర్సీ వద్ద నమోదైన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణలతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి నూతన కేసుల స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు.



మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



కూటమి సర్పంచులకు చీఫ్ విప్ జీవీ సన్మానం

- **ఎన్నికల్లో ఇచ్చిన హామీల ను నెరవేర్చి, అభివృద్ధి చేయాలని పిలుపు**

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)

గ్రామపంచాయతీ సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన కూటమి సర్పంచులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సర్పంచులను సన్మానించి కేక్ కట్ చేసి సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గంలోని మొత్తం 119 పంచాయతీలకు గాను 98 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ప్రజలు ఈ తీర్పునిచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ఆయన సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నిధుల వ్యాయం లోను పనుల నాణ్యత లోను సర్పంచ్ పార దర్శకతను పాటించాలని, అవినీతికి ఆస్కారం లేకుండా, ఎటువంటి పక్షపాతానికి తావు ఇవ్వకుండా ఐదేళ్లపాటు విజయవంతమైన పరిపాలన అందుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్లకు హితువు పలికారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి సర్పంచులు, వార్డు మెంబర్లు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భక్త కనకదాసు కు ప్రకాశం జిల్లా పోలీసులు ఘన నివాళి

ఒంగోలు నవంబర్ 27 ,మనసులో మాట

భక్త కనకదాసు జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భక్త కనకదాసు గారు 1509 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రంలో జన్మించి, విశిష్టమైన కవిగా, తత్వవేత్తగా, సామాజిక సంస్కర్తగా గుర్తింపు పొందారని, తన రచనలు, కీర్తనల ద్వారా సమాజంలోని కుల అసమానతలను రూపుమాపేందుకు కనకదాసు గారు చేసిన కృషి ఎనలేనిదన్నారు . ఆయన రచనలు ప్రజల్లో భక్తి, మానవత, సమానత్వం, న్యాయం, సత్యం వంటి విలువలను బోధించాయని ఆర్ఐ సీతారామరెడ్డి అన్నారు.

నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయండి..

పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు!

- **9 మండలాలు, 52 పంచాయతీలు, 414 వార్డుల్లో రెండవ విడత ఎన్నికలకు సర్వం సిద్ధం**
- **నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరిక**

నరసరావుపేట, నవంబర్ 27 (మనసులో మాట)::

పల్నాడు జిల్లాలో నవంబర్ 29వ తేదీ ఆదివారం జరగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ సూచించారు. జిల్లాలోని 9 మండలాల పరిధిలో గల 52 పంచాయతీలు, 414 వార్డుల లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ తరఫున పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఓటర్లను బెదిరించడం, భయపెట్టడం, ప్రలోభాలకు గురిచేయడం లేదా ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలు జరిగే 9 మండలాలు, 52 పంచాయతీల పరిధిలో నవంబర్ 27వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుంచి నవంబర్ 30వ తేదీ ఉదయం వరకు మద్యం దుకాణాలు తెరవడం, మద్యం విక్రయించడం పూర్తిగా నిషేధమని ఎస్పీ పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి బెదిరింపులు ఎదురైనా, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా లేదా ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నా ప్రజలు వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు లేదా డయల్ 112 / 100 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు వేసేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయి భద్రత కల్పిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

దర్శి, అద్దంకి నియోజకవర్గాల్లో 123 పంచాయతీలకు ఎన్నికలు

ఒంగోలు నవంబర్ 27, మనసులో మాట

ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట పోలీస్ భద్రతా ఏర్పాట్లు: ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్. పోలీసు యాక్ట్ 30, BNSS సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు... అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు (శుక్రవారం) సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారానికి ముగింపు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రకాశం జిల్లాలో 29 వ తేదీన రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు శుక్రవారం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., తెలిపారు. ఈ నెల 29న జరగనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా దర్శి,ముండ్లమూరు,తాళ్లూరు,కురిచేడు,దొనకొండ,అద్దంకి, జె.పంగులూరు,కొరిశపాడు, సంతమాగులూరు మరియు బల్లికురవ 10 మండలాల పరిధిలో మొత్తం 198 గ్రామ పంచాయతీలకు గాను 75 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 123 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఏకగ్రీవం అయిన పంచాయితీలో



45 వార్డులకు అలాగే మొత్తం 2014 వార్డులకు గాను 994 వార్డులు ఏకగ్రీవం కాగా, 1017 వార్డులకు ఎన్నికలు, మరో 3 వార్డులకు ఎన్నికలు జరగడం లేదన్నారు. 298 పోలింగ్ ప్రాంతాల్లో (హైపర్ సెన్సిటివ్ 66, సెన్సిటివ్ 71,నార్మల్ 161) 1282 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా 2,61,105 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలద్వారానిరంతరనిఘాకొనసాగిస్తామన్నారు.ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే ఓటర్లు పోలింగ్ కేంద్రాల పరిసరాల నుంచి వెళ్లిపోవాలని, అక్కడ అనవసరంగా గుమిగూడడం, ఇతర ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడరాదని ఎస్పీ సూచించారు. శుక్రవారంసాయంత్రం 5 గంటల తర్వాత రెండవదశ ఎన్నికల సమయం ముగియడంతో ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని,ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలకు అనుమతి లేదన్నారు.ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఉండరాదని,ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు.ప్రజలు,రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూసంయమనం, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.ఎన్నికలు సజావుగా,ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలన్నారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు 163 బీఎన్ఎస్ఎస్,(144 సెక్షన్) పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాల పేరుతో ర్వాలీలు, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టడం వంటివి చేయరాదు.ఎన్నికల బందోబస్తునిమిత్తం ASP 2,DSP 6, CI 23, SI 26 మరియు సిబ్బంది మొత్తం 1006మందిని, 68రూట్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం 100/200 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమలు చేస్తారు.ముందస్తు చర్యల్లో భాగంగా 283 చెడు నడతగల వ్యక్తుల(రౌడీషీటర్ల)ను,567 మంది ట్రబుల్ మాంగర్స్ను బైండోవర్ చేయడంతో పాటు, శాంతి భద్రలకు విఘాతం కలిగించే/గొడవలు/అల్లర్లు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. 95 గ్రామాలను సందర్శించటం, 40 కార్డాన్ సెర్చ్, 60 పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతలపై, పలు విషయాలపై చర్చించి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 10 కేసులు, ఎక్సైజ్కు సంబంధించి 12 కేసులు, శాంతిభద్రతలకు సంబంధించి 18 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం స్ట్రైకింగ్, రిజర్వ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో అత్యవసర సమాచారం లేదా పోలీసు సహాయం అవసరమైతే సమీప పోలీస్ స్టేషన్ను లేదా డయల్ 112, పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 ద్వారా సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక





బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మిద్దాం..కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,
(మనసులో మాట) నవంబర్, 27,

జిల్లాలో బాల్య వివాహాలను బాగా కట్టడి చేస్తున్నామని.. మరింత సమష్టి కృషితో సామాజిక బాధ్యతగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత శాఖ బాలల పరిరక్షణ విభాగం, జస్ట్ రైట్స్, అసోసియేషన్ ఫర్ వలంటరీ యాక్షన్, చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాల్య, ముందస్తు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనకు చేయీచేయీ కలుపు దామంటూ ప్రతిజ్ఞ చేశారు. చట్టాల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరిక ప్రచార సామగ్రిని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, బాలల హక్కుల పరిరక్షణ, బాలికల విద్య, సాధికారతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు, వారి విద్యాభ్యాసం, వ్యక్తిగత అభివృద్ధి, భవిష్యత్తు అవకాశాలకు ఆటంకం కలిగిస్తాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు దేశానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు, బాల్య వివాహాల వల్ల ప్రభావితమయ్యే వారికి చట్టపరమైన రక్షణలు కల్పించేందుకు బాల్య వివాహ నిషేధ చట్టం 2006 అమల్లో ఉందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనకు కమిషన్ విశేష కృషిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని గొప్ప ఉద్యమంగా తీసుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అవిద్య, ఆర్థిక పరిస్థితులు, అవగాహన లేమి, అభద్రత వంటివి బాల్య వివాహాలకు కారణమవుతున్నాయని.. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి కమిటీలు మొదలు ప్రతిఒక్కరూ క్రియాశీలం కావాలన్నారు. వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి.. బాల్య వివాహాల నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల విశేష కృషితో పాటు వివిధ అధ్యయనాల్లోని ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. బాలికలకు నాణ్యమైన విద్యను అందించడం, వారి హక్కులను గౌరవించడం, ఆత్మవిశ్వాసంతో ఎదిగేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, డీఎంహెచ్‌వో డా. ఎ.శ్రావణ బాబు, జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ, అరవ రమేష్ (ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్), నవభారతి (బాలికల అభివృద్ధి అధికారి), వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజాస్వామ్యమా... పోలీసు రాజ్యమా...?

వినుకొండ ,నవంబర్ 27
(మనసులో మాట)



వినుకొండ నియోజకవర్గంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కూటమి నేతలు, పోలీసులు వ్యవహరించిన తీరుపై మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని, మరికొన్ని గ్రామాల్లో అభ్యర్థులను బెదిరించి ఏకపక్షంగా ఎన్నికలు జరిగేలా పోలీసులు వ్యవహరించారని ఆరోపించారు. కూటమి తరపున గెలిచిన అభ్యర్థులు గుండెల మీద చేయి వేసుకుని ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచామని చెప్పగలరా అని ప్రశ్నించారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ శ్రేణులు తిరగబడటంతోనే ఎన్నికలు నిర్వహించగలిగారని వ్యాఖ్యానించారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో వినుకొండ పట్టణం నుంచి టిడిపి కౌన్సిలర్ ను తీసుకువెళ్లి దొంగ ఓట్లు వేయించారని, తలుపులు వేసి మరీ రిగ్గింగ్‌కు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. పోలింగ్ బూత్‌లోని బ్యాలెట్ బాక్సులను టీడీపీ కార్యకర్తలే తీసుకువెళ్లారని, దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారిని గ్రామస్తులు అడ్డుకుని కొట్టారని పేర్కొన్నారు. కొండ్రముట్ల గ్రామంలో ఇతర గ్రామాల నుంచి వ్యక్తులను తీసుకువచ్చి వైసీపీ కార్యకర్తలను వేధించారని ఆరోపించారు. వైసీపీ శ్రేణులను కొట్టి గ్రామాల నుంచి పారిపోయేలా చేసి అనంతరం దొంగ ఓట్లు వేయించుకున్నారని, మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా దాడులకు పాల్పడ్డారని, దాడులు చేసిన వారిలో ఇతర గ్రామాల నుంచి వచ్చిన రౌడీ మూకలు ఉన్నాయని విమర్శించారు. పోలీసులు ముందస్తు ఆదేశాల ప్రకారం వ్యవహరించారని, ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. కౌంటింగ్ సమయంలో ఎస్ఐ ,సిబ్బంది వ్యవహారశైలిపైనా బొల్లా ఆరోపణలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ఉన్నవారిని పోలీసులు తీసుకువచ్చారని, వైసీపీ అభ్యర్థులు గెలిచిన చోట్ల కూడా టీడీపీ ఖాతాలో విజయాలను వేసుకున్నారని ఆరోపించారు. ఓటర్లతో సంబంధం లేకుండా దొంగ ఓట్లు వేయించారని, ఎన్నికల ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు చోటుచేసుకున్నాయని బొల్లా దుయ్యబట్టారు. కొప్పుకొండ, అందుగులపాడు, శివాపురం, చీకటిగల పాలెం, ఐనవోలు తదితర గ్రామాల్లో దౌర్జన్యాలు జరిగాయని తెలిపారు. మొత్తం 119 గ్రామ పంచాయతీల్లో 24 చోట్ల వైసీపీ మద్దతుదారులు తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పోరాడి విజయం సాధించారని వెల్లడించారు. వైసీపీ నాయకులను పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ అక్రమ కేసులు పెట్టారని, పోలీసులే దాడులకు పాల్పడితే బాధితులు ఎవరికి ఫిర్యాదు చేయాలని ప్రశ్నించారు. శావల్యాపురం ఎస్ఐపై కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. కులాల పేరుతో దూషిస్తూ ఇళ్లకు వెళ్లి కొట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని బొల్లా ప్రశ్నించారు. టీడీపీకి ఓటు వేయలేదనే కక్షతో ఎస్ఐ ద్వారా వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు వైసీపీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలే ఓట్లు వేస్తారని, తప్పులు చేసి గొప్పలు చెప్పుకోవడం సరికాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను కూడా మనుషులుగా గుర్తించాలని, వారిని పురుగుల్లా చూడటం తగదని ఘాటుగా వ్యాఖ్యానించారు. పోలీసుల దురాగతాలను దేవుడు చూస్తున్నాడని అన్నారు.



కోటి దీపోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తోట రాజరాజేశ్వరికి ఆహ్వానం

- **ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ కమిటీ, టీడీపీ నేతలు**

చిలకలూరిపేట నవంబర్ 27
మనసులో మాట

శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నవంబర్ 30వ తేదీ, సోమవారం నాడు అత్యంత వైభవంగా నిర్వహించనున్న కోటి దీపోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని మున్సిపల్ చైర్మన్ తోట రాజరాజేశ్వరిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త కుమారి, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి అమరా రమాదేవి, 21వ వార్డు కౌన్సిలర్ ప్రమీల తదితరులు చైర్మన్ తోట రాజరాజేశ్వరిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తప్పకుండా విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.

నరసరావుపేట ప్రజలు విజ్ఞతతో కూటమికి పట్టం కట్టారు

- **టీడీపీ సీనియర్ నాయకులు కొలి బ్రహ్మయ్య**
- **ఫ్యాక్షన్ రాజకీయాలకు నరసరావుపేటలో చోటు లేదని ప్రజల తీర్పు నిరూపించిందని వ్యాఖ్యి**

నరసరావుపేట, నవంబర్ 27
(మనసులో మాట)::

నరసరావుపేట నియోజకవర్గంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి ఘన విజయం అందించిన ప్రజలకు టీడీపీ సీనియర్ నాయకులు కొలి బ్రహ్మయ్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల విజయంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట ప్రజలు ఎంతో విజ్ఞతతో ఆలోచించి కూటమికి పట్టం కట్టారని, ఫ్యాక్షన్ రాజకీయాలకు ఇక్కడ చోటు లేదని తమ తీర్పు ద్వారా స్పష్టం చేశారని పేర్కొన్నారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని మొత్తం 54 పంచాయతీలకు గాను 44 పంచాయతీలను కూటమి కైవసం చేసుకోవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని కొలి బ్రహ్మయ్య తెలిపారు. అలాగే నరసరావుపేట మున్సిపాలిటీలోని 48 వార్డులోనూ అత్యధిక స్థానాలను మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి రూపేష్ గుప్తా భారీ మెజారిటీతో గెలుచుకోబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కారం ప్యాకెట్లు తెచ్చుకోవాలంటూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినప్పటికీ, నరసరావుపేట ఓటర్లు వైసీపీ కుట్రలను తిప్పికొట్టి శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కొలి బ్రహ్మయ్య కొనియాడారు. నామినేషన్ల ప్రక్రియలో తమను అడ్డుకుంటున్నారంటూ మాజీ ఎమ్మెల్యే హైడ్రామా నడిపారని, స్వయంగా ఎస్పీ బస్సు ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తామని చెప్పినా రాలేదని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో రాజకీయాల్లో కొనసాగాలంటే ప్రతిపక్షం ప్రజలకు మంచి చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కులమతాలకు, పర్ల వైషమ్యాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తూ ప్రశాంతమైన పాలన అందిస్తున్నారని కొలి బ్రహ్మయ్య ప్రశంసించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



మున్సిపల్ పాలకవర్గానికి కౌన్సిలర్ డా. షేక్ ఉల్ప తున్నీస శుభాకాంక్షలు

చిలకలూరిపేట నవంబర్ 27 మనసులో మాట

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తోట రాజా రాజేశ్వరిని, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్త కుమారి ని 14వ వార్డు కౌన్సిలర్ డా. ఎస్. కె ఉల్ఫతున్నీసా మరియు నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నాజ్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి అభినందనలు తెలుపుతూ, చిలకలూరిపేట పట్టణ అభివృద్ధికి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అలాగే తన విజయానికి విశేషంగా కృషి చేసిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తోట రాజా రమేష్ కి ప్రత్యేకంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

ప్రజాసేవే లక్ష్యంగా, వార్డు అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

కందుకూరులో ప్రజాతీర్పును జీర్ణించుకోలేకే బుర్రా ఆరోపణలు : బెజవాడ ప్రసాద్

కందుకూరు నవంబర్ 27, మనసులో మాట

కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పట్టణంలో చేస్తున్న అభివృద్ధిని చూసిన ప్రజలు గురువారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి చైర్ పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులకు ఏకపక్షం గా ఓట్లు వేసి అత్యంత బారీ మెజారిటీ తో గెలిపిస్తున్నారన్న సత్యం గ్రహించిన వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తమ ఓటమిని ఒప్పుకుని దానిని కప్పి పుచ్చుకోవడానికి రిగ్గింగ్ ఆరోపణలు చేస్తున్నారు తప్ప దానిలో వాస్తవం లేదని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు, కందుకూరు ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకుని అభివృద్ధికి పట్టం కట్టేందుకు ముందుకు వచ్చి శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పైన తమ కున్న అభిమానం మరోసారి నిరూపించారని, కూటమి చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లు కు దాదాపు 15వేల మెజారిటీ పైన వస్తుందని, 40 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు ఏకపక్ష విజయం సాధిస్తారని బెజవాడ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు, నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నాటి నుండి నిన్నటి పోలింగ్ వరకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తీసుకున్న చర్యల పట్ల కందుకూరు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తుంటే వైసీపీ ఇంచార్జ్ బుర్రా మరోసారి తన ఓటమిని జీర్ణించుకోలేకే రిగ్గింగ్ ఆరోపణలు చేస్తున్నారని ఇటువంటి అసత్యాలను కందుకూరు ప్రజలు ఎంతమాత్రం నమ్మరని బెజవాడ ప్రసాద్ హితవు పలికారు.







నూతన జిల్లా మలేరియా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం. భూపతికి ఘన స్వాగతం

- **'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమంలో భాగంగా వినుకొండ సబ్ యూనిట్ మరియు వివిధ పీహెచ్‌సీలలో విస్తృత అవగాహన**

పల్నాడు జిల్లా నూతన జిల్లా మలేరియా అధికారి (DMO) గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఎం. భూపతి గారు ఈ రోజు (శుక్రవారం) మొదటిసారిగా వినుకొండ మలేరియా సబ్ యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి. సుబ్బారావు మరియు సిబ్బంది ఆయనను శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించి, ఆత్మీయ స్వాగతం పలికారు.

అనంతరం పల్నాడు DMHO Dr. Chukka రత్నా మనోహన్ ఆదేశానుసారం 'ఫ్రైడే డ్రైడే' (Friday Dry Day) కార్యక్రమంలో భాగంగా డీఎంహో గారి ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని యూపీహెచ్‌సీ (UPHC) హనుమాన్ నగర్, వెల్లటూరు పీహెచ్‌సీ (PHC), మరియు బొల్లాపల్లి పీహెచ్‌సీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన మరియు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహో ఎం. భూపతి గారు మాట్లాడుతూ: మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'ఫ్రై డే' పాటించాలని పిలుపునిచ్చారు.

ఇళ్లలోని నీటి నిల్వ పాత్రలు, కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు మరియు పరిసరాల్లో వర్షపు లేదా వాడుక నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై ఎల్లప్పుడూ మూతలు సరిగ్గా ఉంచాలని, దోమల లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర సర్వేలు, లార్వా తనిఖీలు నిర్వహిస్తూ ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ సబ్ యూనిట్ అధికారి ఎస్.వి. సుబ్బారావు, హెల్త్ సూపర్ సూపర్వైజర్ p. బాలస్వామి , హెల్త్ అసిస్టెంట్ లు ,సంబంధిత పీహెచ్‌సీల వైద్యాధికారులు, మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం సర్పంచ్ పీఠం: కూటమి ధర్మంతో సమసిపోయిన వివాదం!

- **చెరో రెండున్నరేళ్లు పదవి పంచుకునేందుకు టీడీపీ, జనసేన అంగీకారం**
- **ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మండలనేని చరణ్ తేజ మధ్య ఫలించిన చర్చలు**

నాదెండ్ల నవంబర్ 27 మనసులో మాట

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండలం గణపవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ పీఠం విషయంలో కూటమి పార్టీల మధ్య నెలకొన్న వివాదానికి తెరపడింది. శుక్రవారం చోటుచేసుకున్న కీలక పరిణామంతో గ్రామంలో రాజకీయ ఉత్కంఠకు ముగింపు పలికినట్లయింది. గణపవరం సర్పంచ్ పదవి కోసం తెలుగుదేశం, జనసేన పార్టీల అభ్యర్థులు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ స్థానాన్ని తమకే కేటాయించాలని జనసేన వర్గీయులు పట్టుబట్టగా, ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించడంతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

ఫలించిన నేతల చర్చలు

ఈ నేపథ్యంలో కూటమి ఐక్యతను దృష్టిలో ఉంచుకుని ఇరు పార్టీల నాయకులు చర్చలు జరిపారు. తెలుగుదేశం పార్టీ తరఫున స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన పార్టీ తరఫున మండలనేని చరణ్ తేజ మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఐదేళ్ల సర్పంచ్ పదవీకాలాన్ని ఇరు పార్టీల అభ్యర్థులు చెరో రెండున్నర సంవత్సరాలు పంచుకునేలా పరస్పర అంగీకారం కుదిరింది. ఈ మేరకు పదవిని సమానంగా పంచుకునేందుకు ఇరు పార్టీల నాయకులు అంగీకరించారు.



నేతల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో గణపవరం గ్రామంలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. కూటమి పార్టీల మధ్య సమన్వయం, పరస్పర అవగాహనతో సమస్యకు పరిష్కారం లభించిందని ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

అమరావతి, (మనసులో మాట)నవంబర్ 27:

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజమహేంద్రవరంలో జరిగే జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌కు చేరుకుంటారు. 10.15 గంటలకు మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్తారు. మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు నిర్వహించే జిల్లా కోర్టు 222 సంవత్సరాలు, బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో కార్యక్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 01.45 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.



మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

స్థానిక ఎన్నికల్లో ఫలితాలు సంతృప్తిగా ఉన్నాయి

- రాష్ట్ర చీప్ విప్ జీవి ఆంజనేయులు
- 82శాతం టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు
- పల్లె ప్రజలకు వైసీపీ దూరం



వినుకొండ, నవంబర్ 27 (మనసులో మాట)

పట్టణా లైనా ,పల్లెల్లో నైనా రాష్ట్ర ప్రజలు టిడిపి కే పట్టం కట్టారని , ఇలాంటి ఆదరాభిమానాలను చూపించిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర చీప్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 94 శాతం ఎన్డీఏ కైవసం చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు సంతృప్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 78 శాతం కూటమి ప్రభుత్వం కైవసం కోగా,వైసీపీ 26 శాతానికి పరిమితమైనట్లు పేర్కొన్నారు. పల్లె ప్రజలు కూడా వైసీపీని దూరం పెట్టారని వివరించారు. రాష్ట్రంలో ఇక వైసిపికి మనుగడ లేదన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో అరాచకాలు, దోపిడీలు జరగడం వల్లనే రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని దూరం పెట్టినట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,మంత్రి లోకేష్ రాష్ట్ర భవిష్యత్తు కోసం అనేక నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్డీఏ విజయానికి ప్రధాన కారణం వారు తీసుకుంటున్న నిర్ణయాలనీ అలాగే సూపర్ సిక్స్ అమలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరించారన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలను నూరు శాతం టిడిపి కైవసం చేసుకున్నట్లు చెప్పారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలో 119 గ్రామపంచాయతీలు ఉండగా 97 పంచాయతీలు కూటమి అభ్యర్థులు విజయం సాధించారని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో కూడా కూటమి నాయకులు సమన్వయంతో పనిచేశారన్నారు. పంచాయతీల్లో వినుకొండ నియోజకవర్గం 82శాతం విజయం సాధించింది అన్నారు. కొచ్చర్ల, వీరం రాజు పల్లి వంటి గ్రామాల్లో కూడా తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించినట్లు చెప్పారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయని వైసిపి అభ్యర్థులు గెలవము అన్న అభిప్రాయంతోనే పలుచోట్ల ఎన్నికలకు దూరంగా ఉన్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వగ్రామం వేల్పూరులో 3791 ఓట్ల మెజార్టీతో టిడిపి అభ్యర్థి కృష్ణ విజయం సాధించాడని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయం అవుతుందని ఈ సమావేశంలోకూడా పాల్గొన్నారు.

గాయత్రి నగర్ అభివృద్ధికి శ్రీకారం

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)



వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని గాయత్రి నగర్లో బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న "గాయత్రి నగర్"ప్రాంతాన్ని శుక్రవారం బ్రాహ్మణ పెద్దలు సందర్శించారు . గత రెండు దశాబ్దాల క్రితం పూనుకున్న ఈ కార్యక్రమం కుంటు బడటంతో ఆ ప్రాంతమంతా కంపచెట్లతో నిండిపోయింది. ప్రస్తుతం రంగంలోకి దిగిన బ్రాహ్మణ పెద్దలు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం జెసిబి శుభ్రం చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా టిడిపి సీనియర్ నాయకులు. , స్వచ్ఛంద సేవకులు పి.వి సురేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ ఊళ్ళకంచెలతో నిండి ఉన్న సుమారు 5 ఎకరాలు విస్తీర్ణం కలిగిన ఈ స్థలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఉద్దేశంతో వినుకొండ అభివృద్ధి ప్రదాత అయినటువంటి జీ.వి ఆంజనేయులు సహకారం కోడినట్లు తెలిపారు. అలగే బ్రాహ్మణ సంఘ సమిష్టి కృషితో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జీవీ రమణారావు మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్ల క్రితం వినుకొండలోని బ్రాహ్మణులు ఈ ప్రాంతాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ,కొన్ని అనివార్య కారణాల వల్ల కార్యక్రమం ముందుకు వెళ్లలేదని ,మరల బ్రాహ్మణ సంఘ పెద్దలు అందరం ఒకే తాటిపై వచ్చి ,అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. ఇక్కడ ఇంట్ల నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని త్వరలోనే శాశ్వత ఇంటి నిర్మాణాలు చేపట్టటం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అన్ని విధాల సహకారం అందిస్తున్న వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సంఘ పెద్దలు అన్నప్రగడ వెంకటేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు,యం సత్తాయనారాయణ, శేఖర్, శివ, హనుమంతురావు,రవికుమార్ నాగేశ్వరరావు,సాయి పలువురు మరియి గాయత్రీ నగర్ సభ్యులు పాలేవన్నారు.

నిజాంపట్నం సర్పంచ్‌గా మోపిదేవి హరినాథ్ బాబు ఏకగ్రీవ

నిజాంపట్నం, నవంబర్ 27(మనసులో మాట):



నిజాంపట్నం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మోపిదేవి హరినాథ్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ పదవికి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవ ఎన్నికను ధ్రువీకరించారు.అదేవిధంగా ఉప సర్పంచ్‌గా తూనుగుంట్ల సుమన్ (గోల్డ్ షాప్) ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం గ్రామ పంచాయతీ అభివృద్ధికి పదంలో నడిపిస్తానని, పంచాయతీ పరిధిలో ఏ సమస్యలు ఉన్న పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానన్నారు. వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలులో యువ సంవాద్ – వికసిత్ భారత్ కార్యక్రమం

ఒంగోలు నవంబర్ 27 మనసులో మాట

ప్రకాశం జిల్లా ఒంగోలులోని QIS కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో యువ సంవాద్ - సంవిధాన్ దివస్ ఎడిషన్ ఈ కార్యక్రమం నిర్వహించబడిందిఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం AV Narasimha kumar District youth Officer యువతలో భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించడం, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, పౌర బాధ్యతలు మరియు దేశ అభివృద్ధిలో యువత పాత్ర గురించి చైతన్యం కల్పించడం.ఈ కార్యక్రమంలో Step Ceo Srimanarayana garu విద్యార్థులకు, యువత పాల్గొని భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక బాధ్యతలు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించబడుతుంది. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని ఈ కార్యక్రమం ద్వారా A. Padma Sunanda P. D ICDC Garu సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ దినేష్ కుమార్, బి రత్న ప్రసాద్ లీగల్ ఆఫీసర్, మరియు కిస్ కాలేజ్ ప్రిన్సిపాల్ హనుమంతరావు గారు మరియు కీస్ కాలేజీ లెక్చరర్స్, STEP సిబ్బంది మరియు నేషనల్ యూత్ వాలంటీర్స్ పాల్గొని ఈ ప్రోగ్రాంను విజయవంతం చేయడం జరిగింది.



ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ వారి 58వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం

దుర్గి, నవంబర్ 27 (మనసులో మాట)

భారతదేశం లోని ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థ అయిన ఏరీస్ ఆగ్రో లిమిటెడ్, ముంబయి వారు కంపెనీ స్థాపించి 57 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 27112026 వ తేదిన 58 వ సంవత్సరం లోకి అడుగుపెడుతున్న సందర్భంగా దేశంలోని పలు దేవాలయాల్లో, వృద్ధాశ్రమాల్లో, పాఠశాలల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. దేశవ్యాప్తంగా ఇంకా పలు సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానం లో మరియు ఆత్మకూరు గ్రామములో శ్రీ కాశీనాయన వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు చేసారు. ఏరీస్ కంపెనీ వ్యవసాయ రంగంలో ఉపయోగించే అగ్రోమిన్ మాక్స్, అగ్రిప్రో, చలామిన్, ప్లాంటోమైసిన్ మరియు 140 కి పైగా బ్రాండ్లలో నాణ్యమైన పోషక ఎరువులను తయారు చేస్తున్నది. ఏరీస్ ఉత్పత్తులను వాడిన పొలాల్లో అధిక దిగుబడి పొందుతున్నామని రైతులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఆఫీసర్లు జి.అమరయ్య , జి.రాజేష్ , S. శ్రీనివాసరావు గారు T.రామిరెడ్డి , వేణుగోపాలరెడ్డి మరియు కంపెనీ డీలర్స్ తోటకూర నాగేశ్వరరావు, అంజయ్య పాల్గొన్నారు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ అభ్యర్థులు

టంగుటూరు నవంబర్ 27
మనసులో మాట

పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన పలువురు కొండపి నియోజకవర్గంలోని కూటమి సర్పంచి అభ్యర్థులు తూర్పునాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు

ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలియజేసి గ్రామాల్లో అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.



దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధ పిల్లలకు అన్నదానం

ఒంగోలు, నవంబర్ 27
(మనసులో మాట)

ఒంగోలు పట్టణంలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ "దోస్తీ ఫండేషన్ " ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్థానిక భాగ్యనగరం, నాలుగో లైన్ లో గల బొమ్మరిల్లు అనాధ ఆశ్రమంలో పిల్లలకు శుక్రవారం భోజన సదుపాయం మరియు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ సారధ్యంలో ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. అనంతరం షేక్ మహబూబ్ మాట్లాడుతూ తమ సంస్థ దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం అనాధ మరియు పేద వర్గాల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు అలాగే ఒంగోలు పట్టణవాసులు ఎవరైనా పెద్ద మనసు చాటుకొని వారి ఇళ్లల్లో జరిపే పుట్టినరోజు వేడుకలు ఇతర కార్యక్రమాలలో ఆర్భాటాలకు పోకుండా ఇలాంటి పేదలకు ,అనాధ పిల్లలకు మీ చేతనైన సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు



పోలీస్ పహారాతో ... కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రిగ్గింగ్: బుర్రా మధుసూదన్ యాదవ్

- **నువ్వు అభివృద్ధి చేశావు కదా ఎమ్మెల్యే నీకెందుకు భయం..ఈ రిగ్గింగులు దొంగ ఓట్లు వేయించడం ఇదా అభివృద్ధి**



కందుకూరు నవంబర్ 27,
మనసులో మాట

కందుకూరులో నిన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల రాక్షస క్రీడలో కొన్ని ముఖ్యమైన విషయాలు మీడియా ద్వారా చెప్పదలుచుకున్నాను

మీడియా ద్వారా కందుకూరు పట్టణ ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు ,రాష్ట్ర ప్రజలకు తెలియజేద్దామని ఈ మీడియా సమావేశం ఈరోజు ఏర్పాటు చేయడమైనది. నిన్న జరిగిన మున్సిపాలిటీ ఎలక్షన్ ప్రజాస్వామ్య బద్దంగా జరగలేదని తెలియజేస్తున్నాను. పోలీసు ప్రహరీలో, కూటమి నేతలు జరిపిన రిగ్గింగ్ ఎలక్షన్ ప్రజాక్షేత్రంలో తెలుసుకుందామన్న ఎమ్మెల్యే పిరికితనానికి నిన్న జరిగిన ఎలక్షన్ నిదర్శనం.

మున్సిపల్ కమిషనర్ మొదటిగా ఓటర్ స్లిప్పులను ప్రజలకి బి ఎల్ వో ద్వారా పంపిణీ చేయడం జరిగింది. మిగిలిన స్లిప్పులను టిడిపి ఆఫీసుకి పంపించారు. ఇదెక్కడి అన్యాయం కమిషనర్ గారు.ఎవరైతే తెలుగుదేశం నాయకులు వార్డులలో ఉన్నారో వాళ్ల చేతికి ఒకరోజు ముందే ఇవ్వడం జరిగింది. వాళ్లు ఒక లిస్టు రెడీ చేసుకుని ఉదయం నుంచే రిగ్గింగ్ చేయడం స్టార్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి సూత్రధారులు పాత్రధారులు పోలీసులు. గుడ్లూరు ఎస్సై గారు ఇంతకు ముందు జరిగిన జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో నామినేషన్లు గాని, ఎలక్షన్ గాని, కౌంటింగ్ గాని ఆయన ప్రవర్తన కందుకూరు ప్రజలు మొత్తం చూశారు. ఆరోజు కూడా నేను తెలియజేశాను. ఆ ఎస్సై గారు పసుపు చొక్కా వేసుకోలేదు అంతే నిన్న జరిగిన ఎలక్షన్ లో పోలింగ్ బూతులో ఏజెంట్లను బయటికి లాగేయడం స్టేషన్లకు తీసుకెళ్లి స్టేషన్ లో కూర్చోబెట్టడం ఆ తరువాత ఆ బూతుల్లోకి స్వయంగా పోలీసులే కాలేజీ విద్యార్థులతో దొంగ ఓట్లు వేయించడం జరిగింది. ఈ పాత్రలో ముఖ్యంగా గుడ్లూరు సిఐ గారు, కందుకూరు సిఐ ఉన్నారు. కందుక రారు నియోజకవర్గంలో ఉన్న వివిధ మండలాల నుంచి టిడిపి నాయకులను కార్యకర్తలను తీసుకువచ్చి పోలింగ్ బూత్లకు దగ్గరగా ఉంచి రిగ్గింగ్ చేయించడం జరిగింది. 20 వార్డులలో రిగ్గింగ్ పాల్పడడం జరిగింది. మీడియా ద్వారా ఈరోజు ఎమ్మెల్యే ని సూటిగా అడుగుతున్నాను. మీరు సవాలు విసిరారు మేము స్వీకరించాము. శాంతియుత వాతావరణం లో ఎలక్షన్ జరుగుతుంది అని అన్నారు. నేను నామినేషన్లు వేసుకోనించాను, అన్ని రకాలుగా కందుకూరును అభివృద్ధి చేశాను, కందుకూరు పట్టణ ప్రజలు నా పక్షం లో ఉన్నారు అని పెద్ద పెద్ద ప్రగల్భాలు పలికావు. నేను ఏదైనా మాట్లాడితే విత్ ఎవిడెన్స్ తోనే నేను మాట్లాడతాను ఎందుకంటే నీ ఎల్లో మీడియాలోని , నీ పేపర్లలోనూ వస్తే మేము అది కూడా పరిశీలించి మేము వాస్తవాలు మాట్లాడతాము ప్రజల పక్షాన.నిన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో గంట గంటకు రిపోర్టు తెప్పించుకొని 25 సీట్లు వైయస్సార్సీపి కౌన్సిలర్లు గెలుస్తున్నారని తెలియడంతో చంద్రబాబు నాయుడు గారు ఎక్కడ నీకు మొట్టికాయలు వేస్తారో అని ఎక్కడ నా ఎమ్మెల్యే పదవి పోతుందో అని మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎక్కడ మనం ఓడిపోతామో అని పిరికిపందలాగా కాలేజీ విద్యార్థులతో దొంగ ఓట్లు, రిగ్గింగ్ కి పాల్పడ్డావు. సామూహికంగా రిగ్గింగ్ చేశావు, ఇది కూడా నీది గెలుపేనా అని ప్రశ్నించారు. డెమోక్రసీని ఖూనీ చేస్తున్నావు. ఇది కందుకూరు ప్రజలకు తెలియదు అనుకోవడం నీ అమాయకత్వం ప్రజలు అంతా గమనిస్తున్నారు ఎమ్మెల్యే కందుకూరు ప్రజలు నీ గురించి మేకవన్నెపులి అని తెలుసుకుని నీకు ఓటుతో సమాధానం చెప్పాలని చూశారు కానీ నువ్వు రిగ్గింగ్ చేసుకుని ఓట్లు వేయించుకున్నావు.

జగన్మోహన్ రెడ్డిఆదేశాల మేరకు పేదలను కూడా రాజ్యాధికారం లో భాగం చేయాలనే ఆలోచనతో మా పార్టీ బీఫామ్ ఇచ్చి పోటీ చేపిస్తే ఆ బూతులలో కూడా పోలీసులను పెట్టి కొట్టించి, భయభ్రాంతులకు గురిచేసి రిగ్గింగ్, దొంగ ఓట్లు వేయించుకున్నావ్. అలాగే నేను ఎక్కడ వెళ్లి ప్రశ్నిస్తానో అని ఎక్కడ నా గొంతు వినపడుతుందో అని పదిమంది పోలీసులతో నన్ను ఆఫీస్ అరెస్ట్ చేసి బంధించావు.ఎవరికైనా ఒకరోజు అనేది వస్తుంది ఆ రోజు వచ్చినప్పుడు నీ అధికారంతో ఇప్పుడు పాల్పడిన దొంగ ఓట్లు,రిగ్గింగ్, నీ దౌర్జన్యాలు ఆరోజు పనికిరావు. కచ్చితంగా కందుకూరు పట్టణ ప్రజలు నీకు బుద్ధి చెప్తారు. ఈ సందర్భంగా మీడియా ద్వారా చెప్పదలుచుకున్నది ఏమిటంటే ఎవరైతే అన్యాయం చేశారో వాళ్ల మీద పోలీసులు కావచ్చు, అధికారులు కావచ్చు వాళ్ల మీద ప్రవేట్ కేసులు వేస్తున్నాము. అలాగే జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ లోను వాళ్ల పేర్లు ఎక్కించడం జరుగుతుంది. మా అధికారం వచ్చిన తర్వాత ఎక్కడ ఉన్నా కూడా పిలిపించి మరి చట్టం ముందు నిలబెడతామని తెలియజేస్తున్నాను

దూపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ను పరిశీలించిన కలెక్టర్

- **నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి దూపాడుకు నీరు**
- **రానున్న మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని నింపాలి**
- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత**

త్రిపురాంతకం , నవంబర్ 27
(మనసులో మాట)

త్రిపురాంతకం మండలం దూపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పరిశీలించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా వస్తున్న నీటితో రాబోయే మూడు రోజుల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ట్యాంకులోకి నీటిని నింపే ప్రక్రియలో చెరువు కట్టలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు, నీటి నిల్వ సామర్థ్యాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.



రానున్న వేసవి నెలల్లో మార్కాపురం పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన నీటి నిల్వలను అందుబాటులో ఉంచాలని, ఈ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

కౌంటింగ్‌లో జాప్యం నివారించాలి.. ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి..కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: (మనసులో మాట)
నవంబర్ 27,



ఎన్టీఆర్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడిందని, అదే స్ఫూర్తితో తదుపరి విడతల్లో జరగనున్న రెండో, మూడో విడత ఎన్నికలను మరింత సమర్థవంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొదటి విడత ఎన్నికల నిర్వహణపై ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విడత ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలు, కౌంటింగ్ ప్రక్రియలో జరిగిన జాప్యాలు, తదుపరి విడతల్లో చేపట్టాల్సిన మెరుగైన చర్యలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను 15 నిమిషాల్లోపు సీల్ చేసి, భద్రతా నిబంధనల మేరకు లెక్కింపు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో కొన్ని ప్రాంతాల్లో డాక్యుమెంటేషన్, స్టాట్యూటరీ ఫారాల పూర్తి చేయడంలో జాప్యం కారణంగా మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓట్ల లెక్కింపు ఆలస్యమైందని పేర్కొన్నారు. తదుపరి విడతల్లో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, అవసరమైన ఫారాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి తగిన శిక్షణ అందించి కౌంటింగ్ ప్రక్రియను నిర్దిష్ట సమయానికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో తప్పనిసరిగా కనీసం 10 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ సంఖ్యలో టేబుళ్లు ఏర్పాటు చేయడం వల్ల కౌంటింగ్ రౌండ్లు పెరిగి, ఫలితాల వెల్లడిలో జాప్యం జరుగుతోందని తెలిపారు. వార్డుల సంఖ్యకు అనుగుణంగా తగినన్ని కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయడం ద్వారా ఒకటి లేదా రెండు రౌండ్లలోనే లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో స్థలం సరిపోని పక్షంలో పక్క గదులను వినియోగించుకోవాలని లేదా ప్రత్యామ్నాయ కేంద్రాలను ముందుగానే ఎంపిక చేసుకోవాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నందున, కౌంటింగ్ కేంద్రాల లోపల, బయట తగినంత వెలుతురు ఉండేలా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓలు స్వయంగా పర్యవేక్షించి, నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. ఓటింగ్ సమయంలో చెల్లని ఓట్ల నమోదు తగ్గించేందుకు, అధికారులు కొత్తగా సరఫరా చేసిన స్వస్తిక్ స్టాంపులను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. పాత స్టాంపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, ముఖ్యంగా వయసు పైబడిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్న సిబ్బందికి సకాలంలో భోజనం, తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో అధికారులు సిద్ధంగా ఉండాలని, అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో జరగనున్న రెండో, మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సమీక్షలో సూచించిన అన్ని మార్పులు, మెరుగుదలలను తక్షణమే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో సమన్వయం, ముందస్తు ప్రణాళిక, సమయపాలన అత్యంత కీలకమని పేర్కొంటూ, ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పల్లె ,పట్టణం, పరిషత్ ఎన్నిక ఏదైనా ... ప్రజా తీర్పు కూటమిదే !

- **తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంపై హర్షం**
- **సంతమాగులూరు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత పర్యటన.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**

అద్దంకి, నవంబర్ 27
(మనసులో మాట)::



తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం పట్ల నరసరావుపేట శాసనసభ్యులు, అద్దంకి నియోజకవర్గ గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలం ఏల్చూరు, పుట్టవారిపాలెం, పాతమాగులూరు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలు, పార్టీ బలోపేతంపై గ్రామ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పట్టణం, పరిషత్, పల్లె ఇలా ఎన్నిక ఏదైనా ప్రజల తీర్పులో మార్పులేదని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనపై ప్రజలు మరోసారి అచంచల విశ్వాసం కనబరిచారని అన్నారు. తొలి విడతలో గెలుపొందిన విజేతలందరికీ అభినందనలు తెలిపిన ఆయన ఈ గెలుపు ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. విజేతలు అహంకారాన్ని దరిచేరనీయకుండా ప్రజలతో మమేకమవుతూ సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీ వరకు కూటమి ప్రజా ప్రతినిధులు కొలువుదీరడం రాష్ట్రాభివృద్ధికి మేలి మలుపు కానుందని పేర్కొన్నారు. పల్లెల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని డాక్టర్ అరవింద బాబు స్పష్టం చేశారు. పల్లె ప్రగతి, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఉన్న చిన్నపాటి సమస్యలను నాయకులంతా సమన్వయంతో పరిష్కరించుకుని ఐక్యతను చాటాలని, రాబోయే దశల పంచాయతీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి కూటమి అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ టి. రమేష్, గ్రామ ముఖ్య నాయకులు డి. గాలయ్య, దేవరపల్లి అంజి రెడ్డి, దేవంగి రాజు, నక్క వెంకటేశ్వర్లు, నక్కా చిన్న సాంబయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు, ఆర్థిక సాయం

వినుకొండ, నవంబర్ 25 :
(మనసులో మాట)

వినుకొండ పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాల క్రీడాకారులకు 14వ వార్డు కౌన్సిలర్ వడ్డూరి కాశమ్మ ఏకరూప దుస్తులు, ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయోలా ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఏకరూప దుస్తులు, ఆర్థిక సాయంతో పాటు వసతి గృహ విద్యార్థులకు బియ్యం మూటలను గత మూడు సంవత్సరాలుగా అందజేస్తున్నానని తెలిపారు. మనకు ఉన్నంతలోనే కొంతమేరకు పేదలకు విద్యార్థులకు సహకారం అందించడం సమంజసమని భావించి ఇలా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.ఇదే విధంగా క్రీడాకారులకు తమ తోడ్పాటు ఉంటుందన్నారు.లయోలా ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కొండలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో క్రీడాకారులు సాయి, మల్లికార్జునరావు, కౌశిక్, బాలు, అభిరాజు తదితరులు పాల్గొన్నారు

లక్షల మందికి ఆహ్వానం.. కనీస ఏర్పాట్లు కరువు..

- **ఆడంబరాల మధ్య మానవ గౌరవానికి చోటేది?– మాదాసు భాను ప్రసాద్**

చిలకలూరిపేట నవంబర్ 27
మనసులో మాట

బీహార్ రాష్ట్రంలో ఎమ్మెల్యే అనంత్ సింగ్ తన కుమార్తె వివాహ వేడుకకు లక్షలాది మందిని ఆహ్వానించిన నేపథ్యంలో, అక్కడ ఏర్పడిన గందరగోళ పరిస్థితులు సమాజం ఆలోచించాల్సిన అంశమని అడ్వకేట్, లోక్ సత్తా నాయకులు మాదాసు భాను ప్రసాద్ పేర్కొన్నారు.

భారీగా ప్రజలను ఆహ్వానించినప్పటికీ, వారి సంఖ్యకు తగిన ఆహారం, తాగునీరు, భద్రత, ఇతర కనీస సౌకర్యాలు కల్పించడంలో లోపాలు కనిపించడం విచారకరమన్నారు. భోజనం కోసం గంటల తరబడి నిరీక్షించడం, ప్లేట్ల కోసం పోటీపడటం, తోపులాటలు జరగడం, ఆహారం కోసం ప్రజలు ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొన్న అసౌకర్యాలు మనలో మానవత్వం గురించి ఆలోచన కలిగించాలన్నారు. లక్షలాది మందిని ఆహ్వానించడం కంటే, వచ్చిన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన ఆతిథ్యం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. సంపదను, రాజకీయ పలుకుబడిని, ఆడంబరాలను ప్రదర్శించడంలో చూపే శ్రద్ధను ప్రజల భద్రత, సౌకర్యాల విషయంలోనూ చూపాలన్నారు. ప్రజలు ఆహారం కోసం పోటీపడే పరిస్థితులు రాకుండా ముందస్తు ప్రణాళిక, క్రమబద్ధమైన ఆహార పంపిణీ, తగిన భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భారీ కార్యక్రమాల నిర్వాహకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మాదాసు భాను ప్రసాద్ కోరారు.



మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలు

యడ్లపాడు నవంబర్ 27
మనసులో మాట



స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 21వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 నాగరత్నం, ఎం ఈ ఓ 2 జానకిధరరావు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు మరియు సైన్స్ ఎగ్జిబిషన్ వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే గడిచిన విద్యా సంవత్సరంలో చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాఠశాల యాజమాన్యం కోరింది.

టంగుటూరు పంచాయతీ సర్పంచ్ గా బెల్లం జయంతి బాబు

టంగుటూరు నవంబర్ 27
మనసులో మాట

ప్రకాశం జిల్లా టంగుటూరు పంచాయతీ మొదటి విత్త ఎన్నికలు రాజకీయ బసవత్తరంగా మొదటినుంచి పొతుల రామారావు వర్గం, బెల్లం కోటయ్య వర్గీయుల మధ్య పోటాపోటీగా కొనసాగింది. జిల్లాలో రసవత్తరంగా ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్నటువంటి వారికి ఎట్టకేలకు గురువారం సర్పంచ్ అభ్యర్థి బెల్లం జయంత్ బాబు ప్రత్యర్థి పోతుల రామారావు బలపరిచిన అభ్యర్థి చిడిపోతు వెంకటేశ్వర్లు మీద 2013 ఓట్లు మెజారిటీతో కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచిగా గెలుపొందిన బెల్లం జయంత్‌బాబు మాట్లాడుతూ ఈ విజయం ప్రజలకు ఇంకా మరింత చేరువలో సేవ చేసుకునే మార్గాన్ని కల్పించారని సహకరించిన టంగుటూరు గ్రామస్తులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ విజయం ప్రజాసేవకు నిదర్శనం అన్నారు. టంగుటూరు ప్రజలందరూ ఎంతో ఆనందోత్సవాలతో బాణా సంచాలతో ,ర్యాలీలు విజయోత్సవాలు జరుపుకున్నారు.



100వ సైకిల్ సండే సందర్భంగా సైక్లింగ్ అవగాహన ర్యాలీ

గుంటూరు, (మనసులో మాట)
నవంబర్ 27:



దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సండే సైక్లింగ్ కార్యక్రమం 100వ ఎడిషన్ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులో సైక్లింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ఇతివృత్తంతో యువతలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని మై భారత్ రాష్ట్ర సంచాలకులు వెంకట్ ఉజ్వల్ తెలిపారు.
ఈ కార్యక్రమం ఉద్దేశాలను వివరించేందుకు శుక్రవారం మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) గుంటూరు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'టువర్డ్స్ పెడలింగ్, టువర్డ్స్ మార్చ్, టువర్డ్స్ ఒలింపిక్స్' లక్ష్యంతో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మై భారత్ గుంటూరు ఉప సంచాలకులు డి. కిరణ్మయి మాట్లాడుతూ.. శనివారం ఉదయం 10 గంటలకు స్తంభాలగరువులోని శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య మున్సిపల్ పాఠశాలలో 100వ సండే సైక్లింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొననున్నారని, జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ప్రతి ఆదివారం కనీసం అరగంట సైక్లింగ్ చేయడం ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆమె సూచించారు. నషా ముక్త్ భారత్ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువత, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో మై భారత్ సహాయ సంచాలకులు రాము పాల్గొన్నారు.

ఏ.ఎం. రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో ఎం.ఫార్మసీ ఫలితాల విడుదల

- **పలు విభాగాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత**

నరసరావుపేట, నవంబర్ 27
(మనసులో మాట)

స్థానిక ఏ.ఎం. రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల (అటానమస్)లో ఎం.ఫార్మసీ మొదటి సంవత్సరం, రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భర్గవ్ భూషణ్ రావు విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ఈ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. విభాగాల వారీగా ఉత్తీర్ణత వివరాలను వెల్లడిస్తూ ఫార్మాస్యూటిక్స్ మరియు ఫార్మకాలజీ విభాగాలలో విద్యార్థులు నూటికి నూరు శాతం (100%) ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అలాగే రెగ్యులేటరీ అఫైర్స్ విభాగంలో 92.86% మరియు ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ విభాగంలో 78.57% ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కార్యదర్శి



డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జరగబోయే పరీక్షలలో కూడా ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలను రాబట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ సిహెచ్.గోపాలకృష్ణ, డాక్టర్ కె. వెంకట గోపయ్య,డాక్టర్ ఎం. లక్ష్మీ సురేఖ,డాక్టర్ జె.లక్ష్మీ ప్రసన్న లతోపాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో చంద్రబాబు ఇంటి నిర్మాణం పై వైసీపీ విష ప్రచారం

- **టీడీపీ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య**

గుంటూరు, (మనసులో మాట)
నవంబర్, 27,

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో నిర్మించుకుంటున్న ఇంటిపై వైసీపీ నాయకులు కావాలనే విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య విమర్శించారు.50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఆస్తుల విషయంలో ఎంతో నిరాడంబరంగా ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సుమారు 1100 గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంట్లో దాదాపు 30 ఏళ్ల పాటు నివసించారని, ఆ ఇల్లు భువనేశ్వరి కి ఎన్టీఆర్ ద్వారా వారసత్వంగా వచ్చిందని తెలిపారు. లోకేష్ వివాహం అనంతరం 2017లో అదనంగా స్థలం కొనుగోలు చేసి, బ్యాంకు రుణంతో ఇల్లు నిర్మించుకున్నారని, ఇప్పటికీ ఆ రుణాన్ని చెల్లిస్తున్నారని వివరించారు. అదే విధంగా నారావారిపల్లెలో ఉన్న ఇల్లు కూడా చంద్రబాబు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి అని తెలిపారు. ప్రస్తుతం కుప్పంలో 1,455 చదరపు గజాల స్థలంలో జీ ప్లస్ వన్ విధానంలో, అమరావతిలో 1,450 చదరపు గజాల స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఒక ముఖ్యమంత్రి తన నివాస అవసరాల కోసం ఇల్లు నిర్మించుకుంటే దానిని ప్యాలెస్‌గా చిత్రీకరిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన ఇళ్ల విస్తీర్ణంతో పోలిస్తే జగన్‌కు సంబంధించినవిగా ప్రచారంలో ఉన్న ప్యాలెస్‌లు, ఆస్తుల విస్తీర్ణం ఎంతో ఎక్కువగా ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్, తాడేపల్లి, బెంగళూరులోని యలహంక, విశాఖపట్నంలోని రుషికొండ, పులివెందుల, ఇడుపులపాయ వంటి ప్రాంతాల్లో జగన్‌కు సంబంధించిన నివాసాలు, ఆస్తులపై లక్ష్మయ్య పలు వివరాలను ప్రస్తావించారు. ఆయా నిర్మాణాల విస్తీర్ణం, ఆస్తుల వివరాలను పోల్చి చూస్తే వాస్తవ పరిస్థితి ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. అలాగే జగన్‌కు సంబంధించినవిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, వ్యవసాయ భూములు తదితర ఆస్తుల అంశాలు కూడా గతంలో సీబీఐ, ఈడీ కేసుల్లో ప్రస్తావనకు వచ్చాయని తెలిపారు.
50 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసిన చంద్రబాబు నాయుడు తన నివాసం నిర్మించుకుంటుంటే



దానిపై విమర్శలు చేయడం తగదని లక్ష్మయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తుల విషయంలో ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తమ నాయకులకు సంబంధించిన ఆస్తుల వివరాలను కూడా ప్రజలకు వివరించాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.
కుప్పం ఇంటి నిర్మాణాన్ని వివాదాస్పదం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న ప్రతిపక్షాల ప్రచారాన్ని ప్రజలు నమ్మరని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య స్పష్టం చేశారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

కూటమి ప్రభుత్వంలో ఎన్నికలు రాజకీయ పార్టీలతో కాకుండా పోలీసు వ్యవస్థతో చేయాల్సి వచ్చింది!

- **ఎన్నికల వ్యవస్థను కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆరోపణ**
- **నరసరావుపేట మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అక్రమాలపై మీడియా సమావేశంలో వీడియోల ప్రదర్శన**



నరసరావుపేట, నవంబర్ 27 (మనసులో మాట)::

నరసరావుపేట పట్టణ మరియు నియోజకవర్గ పరిధిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము రాజకీయ పార్టీలతో కాకుండా, ప్రత్యక్షంగా పోలీసు వ్యవస్థతో పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నరసరావుపేట పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను అపహాస్యం చేసిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల్లో టీడీపీ, బీజేపీలు నామమాత్రంగానే పాల్గొన్నాయని, పోలీసు యంత్రాంగమే ముందుండి ఎన్నికలను నడిపించిందని గోపిరెడ్డి ఆరోపించారు. ఎన్నికలు ప్రారంభమైన ప్పటి నుండి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లలో ఉంచారని, పోలింగ్ బూత్‌ల నుండి తమ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాగి, ఇతర గ్రామాలు మరియు పట్టణాల నుండి వచ్చిన టీడీపీ కార్యకర్తలను బూత్‌లలోకి పంపి రిగ్గింగ్ చేయించారని ఆయన మండిపడ్డారు. ఉదయం 11:30 గంటల వరకు ప్రశాంతంగా సాగిన పోలింగ్, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందని గ్రహించిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుండి దాదాపు 34 వార్డుల్లో పోలీసుల అండతో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో జరిగాయని చెబుతున్న అక్రమాలకు సంబంధించిన పలు వీడియోలను గోపిరెడ్డి ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ప్రదర్శించారు. 12వ వార్డులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జాన్ సైదా అధ్వర్యంలో దొంగ ఓట్లు వేయించి వ్యాన్లలో తరలించిన దృశ్యాలు, 12 మరియు 27వ వార్డులలో జరిగిన రిగ్గింగ్ విజువల్స్‌తో పాటు, టీడీపీ మహిళా నేత జాహ్నవి గంజాయి బ్యాచ్‌లను మరియు 18 ఏళ్లు నిండని మైనర్లను తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించారని ఆరోపిస్తూ సంబంధిత వీడియోలను చూపించారు. నరసరావుపేట మున్సిపాలిటీలో జరిగిన ఈ అక్రమాలన్నింటికీ ఎంపీ లావు కృష్ణదేవరాయలు సారథ్యం వహించారని డాక్టర్ గోపిరెడ్డి ఆరోపించారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ భర్త నరసరావుపేట కు వచ్చి, ఎంపీ ఆదేశాల మేరకే తాము రిగ్గింగ్ చేస్తున్నామని తమ వార్డు సభ్యుడితో చెప్పారని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, ఎంపీ, ఎస్పీ, డీఎస్పీ, సీఐలు కలిసి ఈ అక్రమాలను జరిపించారని, జొన్నలగడ్డ గ్రామంలో స్వయంగా డీఎస్పీ కూర్చొని రిగ్గింగ్ చేయించారని ఆయన విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా మల్లమ్మ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్‌ను కూడా బాగు చేయలేని టీడీపీ నాయకులు, పట్టణాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారని గోపిరెడ్డి ప్రశ్నించారు. తన రాజకీయ జీవితంలో, చివరకు కోడెల శివప్రసాదరావు హయాంలో కూడా ఇంతటి అక్రమ ఎన్నికలను ఎన్నడూ చూడలేదని అన్నారు. నిజాయితీగా ఎన్నికలకు వెళదామని ఎంపీ లావు కృష్ణదేవరాయలకు సవాల్ విసిరితే, నామినేషన్లు వేయించి ఇలా అక్రమాలకు పాల్పడటం దారుణమని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ 27 వార్డులు మరియు చైర్మన్ స్థానాన్ని గెలుచుకుంటుందని ఇంటెలిజెన్స్ నివేదికలు రావడంతోనే అధికార పార్టీ ఈ అక్రమాలకు ఒడిగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో తాము ఎన్నడూ వ్యవస్థలను దుర్వినియోగం చేయలేదని, అయితే భవిష్యత్తులో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తమ క్యాడర్‌ను కాపాడుకోవడానికి ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాల్సి వస్తుందేమోనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల చేత కాకుండా పోలీసుల ద్వారా సాధించిన ఈ విజయం అసలైన గెలుపు కాదని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.





"కూటమి"తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి _ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, (మనసులో మాట) నవంబర్, 27,

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో ఎమ్మెల్యే కొండయ్యతో, పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు తల్లికి వందనం, దీపం వంటి పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ తల్లుల ఆత్మగౌరవానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని నిర్మాణ పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని, ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నసీర్ అన్నారు. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాలు, విద్యార్థులకు విదేశీ విద్యా పథకం, షాదీఖానాల నిర్మాణం, ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాల చెల్లింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి చేశారు.



ఎస్ వి ఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం

మాచర్ల ,నవంబర్ : 27 (మనసులో మాట)

మాచర్ల పట్టణంలో ఎస్వీఆర్ కళాశాలలో తలసేమియా చిన్నారుల కోసం శుక్రవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు దాదాపు 100 పాల్గొని తలసేమియా చిన్నారులకు అండగా నిలిచారు. సమాజ శ్రేయస్సు కు దోహద పడే ఇటువంటి కార్యక్రమలలో ఎల్లపుడు ఎస్వీఆర్ మరియు కృష్ణవేణి విద్యార్థులు ముందుండడం అభినందనీయం అని పట్టణ ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమం లో మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ యనుముల సుష్మారెడ్డి , మాచర్ల పట్టణ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు యెనుముల కేశవ రెడ్డి మరియు కళాశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపల్ వెంకట్రామయ్య , డైరెక్టర్స్ మరియు బోధన సిబ్బంది పాల్గొనడం జరిగింది.



తెల్లబాడు గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో అధికారుల అక్రమాలు

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)

నూజెండ్ల మండలం తెల్లబాడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్యాయం జరిగిందని NDA కూటమి అభ్యర్థి గరిశా లక్ష్మి నరసమ్మ వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎన్నికలు ప్రారంభం నుండి పోలింగ్ అధికారులు తమకు వెతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఓట్లకు వారే గుర్తు లు చెబుతూ ప్రలోభానికి గురిచేశారని బాధిత అభ్యర్థి ఆరోపించారూ. రెండు వార్డులు ఏకగ్రీవం కాగా ఆ వార్డులోని ఓటర్ల అందరికీ ప్రత్యర్థి గుర్తు ను చూపిస్తూ ఎన్నికలు నిర్వహించారనీ తెలిపారు. అధికారుల ఆగడాలపై పలు సార్లు పోలీసులకు, ఎన్నికల ఉన్నత అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని బాధితులు వాపోయారు. లెక్కింపు సమయంలో బూతుల గెలుపు ను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఓట్లకు తమకు అనుకూలంగా రాదని భావించి ఎన్నికల అధికారి సహకారంతో అనుకున్నట్టు పోలింగ్ బూత్ లో పవర్ కట్ చేశారని వారు ఆరోపించారు. ఏక పక్షంగా ప్రత్యర్థి 20 ఓట్ల మెజార్టీతో గెలపొందారని ప్రకటించడం జరిగిందన్నారు . ప్రజలు మమ్మల్ని నమ్మి మాకు ఓటు వేస్తే ప్రత్యర్థి ఎలా గెలుస్తారో వివరించమంటూ ఓటమిపాలైన అభ్యర్థిని నిలదీస్తున్నారు.
రీకౌంటింగ్ అడిగితే కనీస బాధ్యత లేకుండా మా కౌంటింగ్ ఏజెంట్ లను బయటకు నెట్టేసి సుమారు 40 నిమిషాల పాటు ప్రత్యర్థి ఏజెంట్ లతో పోలింగ్ అధికారి లోపలే ఉండి ఈ ఘాతుకానికి ఓడికట్టారని ఆరోపించారు.
న్యాయం జరగాలి...
గతంలో ఎన్నడు లేని విధంగా ఎన్నికల అధికారులను అడ్డంపెట్టుకొని, ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలని, తమ పంచాయతీ లో మరలా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక శాసనసభ్యులు జివి ఆంజనేయులు ని కలవగా, కలెక్టర్ గారికి వినతి పత్రం అందించి మరలా మీ పంచాయతీ లో ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ ని కోరతామని, హామీ ఇచ్చాడన్నారు.



చీఫ్ విప్ జీవీ నీ మర్యాదపూర్వకంగా కలిసిన Dr. గొట్టిపాటి లక్ష్మీ

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)

దర్శి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ఏ.పి. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ని, దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మరియు టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వినుకొండలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, దర్శి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా బాధ్యతలు చేపట్టిన జీవీ ఆంజనేయులు కి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని తాజా రాజకీయ పరిస్థితులు మరియు రాబోయే ఎన్నికల వ్యూహాలపై నేతలు చర్చించారు.

బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు

మాచర్ల , నవంబర్ 27 (మనసులో మాట)



మాచర్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మాచర్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం నాడు బాల్య వివాహాలు మరియు మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు మాచర్ల మండల న్యాయ సేవాధికార సంస్థ కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ఎం డపల్లి కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాల వలనజరిగే అనర్థాలను తెలియజేశారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, దానికి ప్రోత్సహించిన వాళ్లు కూడా నేరస్తులు అవుతారని తెలియజేశారు. కావున చట్టాల గురించి అవగాహన పెంచుకొని, చట్టబద్ధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ చట్టాల గురించి ,బాల్య వివాహాలుచేసుకుంటే జరిగే అనర్థాల గురించి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని ఆయన సూచించారు. మాచర్ల మండలం న్యాయ సేవ కమిటీ సభ్యులు మరియు పల్నాడు జిల్లా దిశా కమిటీ మెంబర్ మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలకు పేదరికము, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు ప్రధాన కారణమని వాటి గురించి అవగాహన పెంచుకోవాలనీ కోరారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల శారీరక ఎదుగుదల ఆగిపోయి, మానసిక ఎదుగుదల లేక ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని ఈ సందర్భంగా గోవింద రెడ్డి తెలియజేశారు. అంతేకాకుండా చిన్నతనంలోనే గర్భవతులు అయినందువలన శరీరము సహకరించక తల్లి ,బిడ్డకే ప్రాణాపాయము వచ్చే ప్రమాదం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరిక చేశారు. కాబట్టి బాల్య వివాహాలు చేసుకోకుండా మంచిగా చదువుకొని ,మీ కుటుంబానికి, పేద ప్రజలకి ,సమాజానికి, దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో జీవనం చేయాలని గోవిందరెడ్డి కోరారు. మంచి క్రమశిక్షణ, దేశభక్తితో మాదకద్రవ్యాలకు లోను కాకుండా చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచిగా విద్యను అభ్యసిస్తూ మహానుభావులు కలలు కన్నా నవభారత నిర్మాణానికి నాంది పలకాలని మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.ప్రవీణ్ ,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ,ఉపాధ్యాయుని ,ఉపాధ్యాయులు , విద్యార్థినిలు పాల్గొన్నారు.

కాలకూట విషయాన్ని మింగి జీవకోటిని రక్షించిన శివుడు : హరి హర పంత్ శివాచార్య.

పెదనందిపాడు నవంబర్ 27 (మనసులో మాట)

అమృతం గురించి దేవ. రాక్షసులు క్షీరసముద్రం చిలికించినప్పుడు వచ్చిన కాల కూట విషయాన్ని ప్రపంచం భరించలేని సమయంలో ఏ దేవతలు చేయలేని పనిని. ఆ మహాదేవుడు పరమ శివుడు తన గరళ కంఠం లో ఆ కాలకూట విషాన్ని బంధించి సకల జీవకోటిని రక్షించారని. శైవగమ విద్యారత్న భాషా ప్రవీణ నాగ లింగం హరిహర పంత్ శివాచార్య అన్నారు. పెదనందిపాడు లోని పురాతన దేవాలయం శ్రీ బాలాజీపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శివ పంచాక్షరి మంత్రం ఓం నమశ్శివాయ. ఓం నమశ్శివాయ. ఓం నమశ్శివాయ అంటూ జపించడం వలన అందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు సిరి సంపదలు లభిస్తాయి అన్నారు. వారు తన ప్రసంగంలో శివుని గురించి చేసిన విశ్లేషణ ప్రముఖులను ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొన్నూరి బాల కుటుంబరావు. దాతలు దాసరి శేషగిరిరావు కుసుమాంబ. దాసరి సత్యనారాయణ వసుంధర దేవి దంపతులు. తడవర్తి సురేష్ బాబు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక మురళీకృష్ణ శర్మ. మామిడిపాక రంగారావు. వసంతరావు. శివ స్వాములు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బాలికలకు విద్యే రక్ష.. బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- **జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, నీడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల్య వివాహాల వ్యతిరేక దినోత్సవం**

నరసరావుపేట, నవంబర్ 27 (మనసులో మాట)::



బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసరావుపేట, కారంపూడి, నాదెండ్ల, అమరావతి మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (KGBV) ఈ కార్యక్రమాలను నిర్వహించారు. నరసరావుపేట లోని కేజీబీవీ పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మరియు న్యూ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి (PD) ఎం.నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్యపై తీవ్ర దుష్ప్రభావాలు పడతాయని అన్నారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డి.శౌరి రాజు బాలల హక్కులు, బాల్య వివాహ నిరోధక చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీడ్స్ సంస్థ డైరెక్టర్ కె.ప్రేమానందం మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆటలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి నినాదాలు చేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, లైన్ డిపార్ట్‌మెంట్స్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో ఆదిలక్ష్మి, నీడ్స్ కోఆర్డినేటర్ బి. రామచంద్ర, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏలూరు తహసీల్దార్ పై అవినీతి కేసు

ఏలూరు , నవంబర్ 27 (మనసులు మాట)

ఏలూరు తహసీల్దార్ శెట్టి వెంకట రవీంద్రనాథ్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసి అదుపులోనికి తీసుకోవడం జరిగిందని అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ జివి కృష్ణారావు చెప్పారు. కేసు విషయాలను తెలియజేసారు. ఏలూరు తంగెళ్లమూడి ఏరియా ద్వారకా నగర్ కు చెందిన ఫిర్యాదుదారుడు అయిన జంగం గోపాలం (46) తన యొక్క పేరు అదార్ కార్డు నందు జంగం గోపాలం అని వున్నదని, వారి పిల్లల చదువుల సర్టిఫికెట్స్ మరియు ఇతర చిరునామా అవసరముల నిమిత్తము తన యొక్క పేరును జినగం గోపిగా మార్చుకొను నిమిత్తము తహసిల్దార్ యొక్క గెజెట్ నిమిత్తము సంబంధిత పత్రములు అన్ని తీసుకుని గెజెట్ నోటిఫికేషన్ ఇప్పించుటకు గాను ఏలూరు అర్బన్ తాసిల్దార్ అయిన శెట్టి వెంకట రవీంద్రనాథ్ ని కలువగా తన అప్లికేషను ప్రాసెస్ చేసి “the Andhra Pradesh Gazette for changing his name from “Jangam Gopalan” to “Jinagam Gopi” నోటిఫికేషన్ ఇచ్చుటకు గాను 10 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసారని తమ కార్యాలయంనకు ఫిర్యాదు చేశారన్నారు. సదరు ఫిర్యాదు పై శుక్రవారం మధ్యాహ్నం 12.20 ని.లకు ఏలూరు అర్బన్ తహసిల్దార్ శెట్టి వెంకట రవీంద్రనాథ్ గారు ఫిర్యాదుదారుడు అయిన జంగం గోపాలం అను వారి వద్ద వారి కార్యాలయంలో 10 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా నిఘా పెట్టి, వలపన్ని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేయడం జరిగిందని కృష్ణారావు తెలిపారు. . శెట్టి వెంకట రవీంద్రనాథ్ 2000 సం.లో జూనియర్ అసిస్టెంట్ గా రెవిన్యూ డిపార్టుమెంటు నందు జాయిన్ అయ్యి అంచెలంచెలుగా తహసిల్దార్ గా ప్రమోషన్ పొంది ఏలూరు అర్బన్ తాసిల్దార్ పని చేస్తున్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **నవంబర్ 29న 5 మండలాల్లోని 53 పంచాయతీలు, 540 వార్డులకు పోలింగ్**
- **534 పోలింగ్ కేంద్రాల్లో 1,728 మంది సిబ్బంది నియామకం**
- **194 అత్యంత సమస్యాత్మక, 82 సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా**
- **అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాలు**

నరసరావుపేట, నవంబర్ 27 (మనసులో మాట)::

నవంబర్ 29న జరగనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. శుక్రవారం ఎన్నికల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు జారీ చేశారు. రెండవ దశలో భాగంగా 5 మండలాల్లోని 53 గ్రామ పంచాయతీలు, 540 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే 98 గ్రామ పంచాయతీలు, 1,144 వార్డులు ఏకగ్రీవమయ్యాయని వివరించారు. పోలింగ్ నిర్వహణ కోసం 534 పోలింగ్ కేంద్రాలు, 53 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల కోసం 641 మంది ప్రిసైడింగ్ అధికారులు, 641 మంది ఏపీఓలు, 446 మంది ఇతర పోలింగ్ అధికారులు కలిపి రిజర్వుతో సహా మొత్తం 1,728 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, వాహనాల సమీకరణను పూర్తి చేశామన్నారు. జిల్లాలోని 194 అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), 82 సమస్యాత్మక



(సెన్సిటివ్) పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక పోలీసు బందోబస్తు, నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియను సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. బ్యాలట్ పేపర్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు, పంపిణీ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. నోడల్, రూట్, జోనల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి ఉల్లంఘనలకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుల స్వీకరణ, తక్షణ స్పందన కోసం కంట్రోల్ రూమ్‌తో పాటు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో ప్రతి రౌండ్ ఫలితాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, స్వల్ప మెజారిటీ ఉన్న పంచాయతీల వద్ద చెల్లని ఓట్ల పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



షమీం ఖాన్ కు శుభాకాంక్షలు తెలిపిన మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు

వినుకొండ ,నవంబర్ 27 (మనసులో మాట)

ఇటీవల వినుకొండ పురపాలక సంఘం నూతన చైర్ పర్సన్ గా ఎన్నికైన చెరుకుంపాలెం షమీంఖాన్ ను వినుకొండ మెడికల్ షాప్స్ అసోసియేషన్ మరియు ఏజెన్సీస్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారూ. నూతనంగా చైర్ పర్సన్ బాధ్యతలు స్వీకరించిన షమీంఖాన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. వినుకొండ పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు అనంతరం చైర్ పర్సన్ షమీం ఖాన్ మాట్లాడుతూ వినుకొండ పట్టణ అభివృద్ధి కోసం స్థానిక వ్యాపారులు తోడ్పాటు అందించాలని కోరారు అభివృద్ధి పనుల విషయంలో సలహాలు ఇస్తే స్వీకరించగలమని షమీం ఖాన్ అన్నారు. కలిసిన వారిలో మెడికల్ షాప్స్ అసోసియేషన్ ప్రతినిధులు సముద్రాల వెంకటేశ్వర్లు ,రమేష్ బాబు, పబ్బిశెట్టి శివ , మారుతి ,డి నరసింహారావు లు పాల్గొన్నారు

పంచాయతీ ఎన్నికల్లో ప్రజా మద్దతు కరువైన వైసిపి : పల్లా శ్రీనివాసరావు

అమరావతి, (మనసులో మాట) నవంబర్, 27,

రాష్ట్రంలో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కూటమికి పట్టం కట్టడం ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నాయకత్వం, యువనేత నారా లోకేష్ ఆలోచనా విధానాలపై ప్రజలు విశ్వాసం ఉంచారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అర్బన్ లోకల్ బాడీ ఎన్నికలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారులను ప్రజలు 26 శాతానికే పరిమితం చేశారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ వైసీపీ పట్ల ప్రజాదరణ తగ్గిందని అన్నారు.



2024 ఎన్నికల్లో ఈవీఎంలపై ఆరోపణలు చేసిన వైసీపీ నాయకులకు, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల ఫలితాలే సమాధానమని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్, ఈవీఎం ఏ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల విధానంపై ఆరోపణలు చేయకుండా ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు, బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించిందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించిన ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు.

కుప్పం మండలం వానగుట్టపల్లిలో మృతి చెందిన రాజేంద్రన్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త అని, ఆయనకు పార్టీ సభ్యత్వం కూడా ఉందని పల్లా స్పష్టం చేశారు. రాజేంద్రన్ టీడీపీ సభ్యత్వ నంబర్ 19023144 (20242026) అని వెల్లడించారు. ఈ ఘటనపై వైసీపీ, సాక్షి పత్రిక తప్పుడు ప్రచారం చేస్తూ టీడీపీ నాయకులపై నిందలు వేయడం సరికాదని విమర్శించారు. మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, సభ్యత్వ బీమా ద్వారా రూ.5 లక్షలు అందించడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పత్రికలు వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను విస్మరించకూడదని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచురించడం సరికాదని అన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఇప్పటికే డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తోందని, స్థానిక సంస్థల్లోనూ కూటమి విజయం సాధించడంతో త్రిపుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండు, మూడు విడతల పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి ఇదే విజయ పరంపరను కొనసాగిస్తుందని, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఈ విజయం మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- **9 గ్రామ పంచాయతీలకు గాను ఒకటి ఏకగ్రీవం.. మిగిలిన 8 పంచాయతీల్లో 89 వార్డులకు ఎన్నికలు**

వేటపాలెం నవంబర్ 26 మనసులో మాట

వేటపాలెం: మండల పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ పి. రాజారావు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. వేటపాలెం మండలంలో మొత్తం 9 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇప్పటికే ఒక గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. మిగిలిన 8 గ్రామ పంచాయతీల పరిధిలోని 89 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శాంతి సమావేశాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేందుకు ఓటర్లు, అభ్యర్థులు అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

